ఈనాడు
తూర్పుగోదావరి
గురువారం అక్టోబరు 3, 2024

మాణిక్యాంబ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు



ద్రాక్షారామ, న్యూస్‌టుడే: అష్టాదశపీఠాల్లో 12వ పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం కానున్నాయి. 14వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఉదయం 6.35 గంటలకు కలశపూజతో ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో దుర్గాభవాని తెలిపారు. అమ్మవారికి రోజూ ఉదయం 4 గంటల నుంచి మేలుకొలుపు, తీర్థపుబిందె, బాల భోగం, లక్షకుంకుమార్చనలు జరుగుతాయి. 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు నిత్య అనుష్టానములు, వైదిక కలాపములు, మధ్యాహ్నం 1 నుంచి 3.30గంటల వరకు దేవులపల్లి ఫణిరామకృష్ణ 'శ్రీచక్రనవావరణార్చన', సాయంత్రం కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు ఉంటాయి.. ప్రతిరోజూ రాత్రి 6.30గంటల నుంచి అమ్మవారికి విశేష పుష్పాలు, సువర్ణపుష్పాలతో అర్చన నిర్వహిస్తారు.

ఎర్ర సముద్రం.. ముందుకొచ్చిందండి!

ఇటీవల విడుదలైన 'దేవర' సినిమా గుర్తుందా.. అందులో కథంతా ఎర్ర సముద్రం చుట్టూనే తిరుగుతుంది. ఆ ఎర్ర సముద్రం ఇప్పుడు మన ప్రాంతానికీ వచ్చింది. ఎక్కడంటారా? కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం అమీనాబాద్ ఓడ రేవు వద్ద.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద పెద్దవాగు రూపంలో సముద్రంలో కలుస్తోంది. దీంతో నీలిసాగరం కాస్త ఎరుపు, లేత, ముదురు నీలం రంగుల్లో చూపరులను ఆకట్టుకుంటుంది. గట్టును తాకుతుందా అన్నట్లు తొలుత ఎర్రనీరు పలకరిస్తుంది. సందర్శకులు తమ చరవాణుల్లో క్లిక్‌మన్పిస్తున్నారు. - ఈనాడు, కాకినాడ



వైకాపా పాపం.. ప్రగతికి శాపం

విడుదల కాని రూ.28.62 కోట్ల ఆర్థికసంఘం నిధులు

ఈనాడు, రాజమహేంద్రవరం: అయిదేళ్ల వైకాపా పాలనలో చూపించిన నిర్లక్ష్యం నగర పాలక సంస్థలు, నగర పంచాయతీలకు గ్రహపాటుగా మారింది. ఈ ఏడాది 15వ ఆర్థిక సంఘం నిధుల్లో సగం విడుదల చేసినా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని సంస్థలకు రాలేదు.. తద్వారా రాజమహేంద్రవరం, కాకినాడ కార్పొరేషన్‌లు, ఏలేశ్వరం నగరపంచాయతీ వంటివి సుమారు రూ.28.62 కోట్ల మేర కోల్పోవాల్సి వచ్చింది.

పాలకవర్గాలు లేక..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు 2014లో ఎన్నికలు జరగ్గా ఆ పాలక వర్గం 2019 వరకు కొనసాగింది. గడువు ముగిసినప్పటి నుంచీ ప్రత్యేక అధికారుల పాలనలో ఉంది. అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం అయిదేళ్లలో ఎన్నికల దిశగా అడుగులు వేసేందుకు కనీస కసరత్తు చేయలేదు. విలీన పంచాయతీలకు సంబంధించిన కొన్ని న్యాయపరమైన చిక్కులు పరిష్కరించడంలోనూ విఫలమే. సాధారణగా 15వ ఆర్థిక సంఘం ద్వారా ఏటా సుమారు రూ.35 కోట్ల మేర నిధులు ఈ కార్పొరేషన్‌కు మంజూరవుతుంటాయి. మొదటి విడతలో రూ.17.5 కోట్లు అందరితో పాటు రావాల్సి ఉన్నా పాలక వర్గాలు లేక కేంద్రం విడుదల చేయలేదు.

■ కాకినాడ నగరపాలక సంస్థకు తెదేపా ప్రభుత్వ హయాంలో 2017లో ఎన్నికలు నిర్వహించగా ఆ పాలకవర్గం 2022 సెప్టెంబరు 15 వరకు కొనసాగింది. ఇక్కడ ఆరు గ్రామాల విలీనానికి సంబంధించి న్యాయపరమైన వివాదాలున్నాయి. వీటిని పరిష్కరించడంలో వైకాపా సర్కారు చొరవ చూపలేదు. నగరపాలక సంస్థకు పాలకవర్గం లేక ఆర్థిక సంఘం నిధులు కేంద్రం మంజూరు చేయలేదు. ఇక్కడ సగటున ఏడాదికి సుమారు రూ.20 కోట్లు వస్తుంటాయి. ఈ విడతలో దాదాపు రూ.10 కోట్లు మంజూరవుతాయని భావించినా మొండి చేయే ఎదురైంది.



రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం

ఆదాయ వనరులు పెంచుకోనందున...

ఏలేశ్వరం నగర పంచాయతీకి పాలకవర్గం ఉన్నా కేంద్ర నిబంధనల మేరకు ఆదాయాన్ని వృద్ధి చేసుకోవడంలో విఫలమైంది. దీంతో తొలివిడత విడుదలవ్వాల్సిన సుమారు రూ.1.12 కోట్లు రాలేదు. కేంద్రం నుంచి ఆర్థిక సంఘం నిధులు రావాలంటే పాలకవర్గాలు ఉండాలి.. ఆయా స్థానిక సంస్థల ఆదాయం ఏటా 12.01 శాతం పెరుగుదల నమోదవ్వాలన్న నిబంధన ఉంది. ఇది ఏలేశ్వరానికి శరాఘాతంగా మారింది.

కొవ్వూరులోనూ పెరగని ఆదాయం

కొవ్వూరు పురపాలక సంఘంలోనూ కేంద్రం నిబంధనల మేరకు 12.01 శాతం అధిక ఆదాయ వనరులు సమకూర్చుకోలేకపోయారు. మరో రూ.2 లక్షల మేర ఆస్తిపన్నుల రూపేణా వసూలు చేసుంటే తొలివిడతగా అన్ని పట్టణ స్థానిక సంస్థలతోపాటు రూ.70 లక్షల మేర ఆర్థిక సంఘం నిధులు వచ్చేవి. అవి సమకూరలేదు.

అభివృద్ధి పనులకు అవకాశం..

కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులతో 50 శాతం మేర పారిశుద్ధ్యం, కాలువల నిర్మాణం తదితర అవసరాలకు, మిగతా 50 శాతం నిధులతో సాధారణ, సుందరీకరణ పనులు చేసుకోవచ్చు. గత పాలకులకు కొరవడిన ముందు చూపు, విడుదల చేసిన నిధులు ఇతర అవసరాలకు మళ్లింపు వంటి వ్యవహారాలు సమస్యకు కారణమయ్యాయి.

విక్రయ కష్టాలకు సెలవిక

■ ధాన్యం సేకరణకు విధివిధానాలు ఖరారు

■ తూర్పులో 2.45 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ప్రకృతి ఆటుపోట్లను తట్టుకొని సేద్యం చేసే రైతులకు సాంత్వన చేకూర్చేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం సకాలంలో సేకరించి 48 గంటల్లో వారి ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా కార్యాచరణ ప్రారంభించింది. ఈనెలాఖరు నాటికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనుంది. రైతు సేవా కేంద్రాల ద్వారా విధివిధానాలను రూపొందించి పౌరసరఫరాల శాఖ ఇటీవల జీఓ.ఎంఎస్ నెం.11ను విడుదల చేసింది. దీంతో అత్యధికంగా వరి పండించే మన జిల్లాలో చకచకా అడుగులు పడుతున్నాయి.



తూర్పుగోదావరి జిల్లాలో ఇలా..

సాగు చేసిన ఆయకట్టు	ధాన్యం ఉత్పత్తి అంచనా:
1.92 లక్షల ఎకరాలు	4,32,000 మెట్రిక్ టన్నులు

కొనుగోలు లక్ష్యం 2.45 లక్షల మెట్రిక్ టన్నులు

గతంలో ఎన్ని ఇబ్బందులో..

వైకాపా ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలుకు పాలకుల హడావిడి తప్ప.. రైతుల నుంచి తీసుకున్నది అంతంతమాత్రమే. కొనుగోలు కేంద్రాలకు వచ్చేవారికి సవాలక్ష కొర్రీలు పెట్టేవారు. వాహనాలు సమకూర్చలేదు. తీరా రైతులే నానా అవస్థలు పడి మిల్లుల వద్దకు తీసుకువెళ్తే దిగుమతి చేసుకోక ఇబ్బందులకు గురి చేసేవారు. మిల్లర్ల మాయాజాలంతో గిట్టుబాటు ధర అందని ద్రాక్షగానే మిగిలిపోయేది.

ఇప్పుడు ఇలా..

రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ క్రాప్ నమోదు చేయించుకున్న ప్రతి రైతు వద్ద గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేసేలా ప్రస్తుతం చర్యలు తీసుకోనున్నారు. గ్రామ సభలు నిర్వహించి రైతులు సూచించిన మిల్లులకే ధాన్యం రవాణా చేస్తారు. సేవా కేంద్రాల్లోని సాంకేతిక సిబ్బంది తేమ శాతం చూసి.. నిబంధనల మేరకు ఉన్నట్లు నిర్ధారిస్తే అదే అంతిమం. స్థానిక మార్కెట్‌లో మంచి ధర లభిస్తే అక్కడా అమ్ముకోవచ్చు. ధాన్యం మిల్లుకు చేరిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయి. క్షేత్ర స్థాయిలో ఈ క్రాప్ చేయించుకున్న వారి జాబితాలు, ఆధార్ అనుసంధాన బ్యాంకు ఖాతాలను ఈమేరకు సిద్ధం చేస్తున్నారు. సీఎంఆర్ మిల్లులకు రైతులు సొంతంగా వాహనాలు సమకూర్చుకుని ధాన్యం రవాణా చేస్తే.. ఛార్జీలు రైతు ఖాతాల్లో వేస్తారు.



కార్యాచరణ ప్రారంభం..

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించామని సంబంధిత అధికార యంత్రాంగం స్పష్టం చేసింది. గోనె సంచుల కొరత లేకుండా సిద్ధం చేస్తున్నామని.. తేమ యంత్రాలు, ఎలక్ట్రానిక్ కాటాలను ప్రతి ఆర్‌ఎస్‌కే వద్ద అందుబాటులో ఉంచుతున్నామన్నారు. సాంకేతిక సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని.. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

ఈ ఖరీఫ్ సీజన్ నుంచి కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.117 మద్దతు ధర పెంచింది. ప్రస్తుత సీజన్‌లో 'ఏ' గ్రేడు ధాన్యం 2,320 (75 కిలోల బస్తా రూ.1740), సాధారణ రకం క్వింటాలుకు రూ.2,300 లకు (75 కిలోల బస్తా రూ.1725) రైతుకు దక్కేలా చర్యలు చేపట్టారు.

గ్రామస్వరాజ్యమే మోదీ సంకల్పం

ఎంపీ పురందేశ్వరి

ఏ.వి.ఏ రోడ్డు, న్యూస్‌టుడే: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ స్థాపనే లక్ష్యంగా ప్రధాని మోదీ అడుగులు వేస్తున్నారని.. అందులో భాగంగానే పరిశుభ్ర భారత్‌ను సాకారం చేసేందుకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం తెస్తున్నారని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం కోటిపల్లి బస్టాండ్ వద్ద స్వచ్ఛతా హీ సేవ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి, కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని పురస్కరించుకుని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం మోదీ స్వచ్ఛభారత్ పిలుపు ఇచ్చారని.. గాంధీ ఆశయాలకు అనుగుణంగానే ఆ కార్యక్రమ సూచికలో గాంధీజీ కళ్లజోడును గుర్తుగా ఉంచారన్నారు. స్వచ్ఛభారత్ నిర్మాణంలో అందరం అంకితమవుదామని పిలుపునిచ్చిన ఆమె.. ఆ మేరకు ప్రతిజ్ఞ చేయించారు. 2047 వికసిత్ భారతదేశాన్ని మన భవిష్యత్తు తరాలు చూడాలని ఆకాంక్షించారు. గతంలో చేపట్టిన నిర్మల్ పురస్కారాలు కేవలం కాగితాల వరకు పరిమితమయ్యాయని విమర్శించారు. ఆర్ఎంఓ వినూత్న, జిల్లా ప్రజా రవాణా అధికారి కె.షర్మిళ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కోటిపల్లి బస్టాండ్ వద్ద స్వచ్ఛతా హీ సేవలో పాల్గొన్న ఎంపీ పురందేశ్వరి, కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

అతివలకు అండగా.. మహిళా రక్షక్



లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

వాహనాలు, లోగో ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

దానవాయిపేట (రాజమహేంద్రవరం): ప్రస్తుత సమాజంలో మహిళల భద్రత ఒక సమస్యగా మారిందని.. దానికి పరిష్కారానికే పోలీసుశాఖ ఆధ్వర్యంలో 'మహిళా రక్షక్' రూపొందించామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం గాంధీజయంతిని పురస్కరించుకుని ఏలూరు రేంజ్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన రక్షక్ వాహనాలు, లోగో ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని పుష్కరఘాట్ వద్ద చేపట్టిన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ డి.నరసింహ కిషోర్ పాల్గొన్నారు. కలెక్టర్ చేతుల మీదుగా మహిళా రక్షక్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించగా.. ఎస్పీ లోగోను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పోలీసుశాఖ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తనను భాగస్వామిని చేయడం అభినందనీయమన్నారు. అదనపు ఆర్థిక భారం లేకుండా పోలీసుశాఖ మహిళ రక్షక్‌లను ఏర్పాటు చేయడం మంచి ఆలోచనన్నారు. బాలికలు, విద్యార్థినులపై వేధింపులు కట్టడి చేయడంతో పాటు.. రాత్రి వేళ భద్రత కల్పించాలంటే ఈ బృందాలు అవసరమని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మహిళలు, బాలికల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారి రక్షణకు ప్రత్యేకంగా 9493206006, 112 నంబర్లు 24/7 అందుబాటులో ఉంటాయన్నారు. మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదన్నారు. అనంతరం పుష్కరఘాట్ నుంచి దేవీ చౌక్ వరకు వాహనాలు, సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించి కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఏఎస్పీ ఎ.వి.సుబ్బరాజు, డీఎస్పీలు ఎస్.భవ్య కిషోర్, కె.రమేష్‌బాబు, అధికారి కె.విజయకుమారి పాల్గొన్నారు.

రాజమహేంద్రిలో రేపటి నుంచి టెట్

పరీక్ష రాయనున్న 9,850 మంది అభ్యర్థులు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రేపటి నుంచి జిల్లాలో ప్రారంభం కానుంది. తూర్పుగోదావరి జిల్లాలో లూథర్‌గిరి రాజీవ్‌గాంధీ ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఈ పరీక్షలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేశామని డీఎస్ఈఓ కె.వాసుదేవరావు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. మధ్యాహ్నం 2.30గంటల నుంచి 5 వరకు రెండు విడతలుగా ఈ పరీక్షలు జరగనున్నాయి. ఈ నెల 4 నుంచి 21వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షకు బుధవారం నాటికి 9,850 మంది అభ్యర్థులు హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. పరీక్షా కేంద్రం వద్ద ఎప్పటిలాగే 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి గంటన్నర ముందుగా హాజరు కావాలని. తమ వెంట హాల్‌టిక్కెట్‌తో పాటు గుర్తింపు కార్డులను తీసుకురావాలన్నారు. లేకుంటే పరీక్షా కేంద్రానికి అనుమతించరని డీఎస్ఈఓ స్పష్టం చేశారు.

అసలే దసరా.. ఎందుకిలా: రాజమహేంద్రవరానికి చెందిన అభ్యర్థులకు కాకినాడ లేదా కోనసీమ ప్రాంతాల్లో పరీక్ష కేంద్రం వస్తే ఫర్వాలేదు. కానీ చాలా మందికి విజయవాడ, బెంగళూరు, తిరుపతి వంటి సుదూర ప్రాంతాల్లో పరీక్షా కేంద్రం రావడంతో గగ్గోలు పెడుతున్నారు.



దసరా ఉత్సవాలకు విద్యుద్దీపాలంకరణ

దేవీచౌక్‌లో అమ్మవారి మూర్తి ప్రతిష్ఠాపన



రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: గోదావరి తీరంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే రాజమహేంద్రవరం దేవీచౌక్ శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు శుభారంభం చేశారు. బుధవారం రాత్రి 9.09 గంటలకు శ్రీదేవి కల్యాణ మండపం నుంచి అమ్మవారి ఉత్సవమూర్తిని మేళతాళాలతో ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి యంత్రస్థాపనతో అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పూజలు చేసి, హారతి అందించారు. విద్యుద్దీపాలను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిప్పన్ వంగ.. వింతగా చూడంగ



కడియపులంక నర్సరీల్లో చైనాకు చెందిన నిప్పన్ వంగ జాతి కాయలు పసుపురంగులో అబ్బుర పరుస్తున్నాయి. ఇవి బొకేలలో వాడేందుకు వినియోగిస్తారు. తెలుగులో వీటిని గోముఖ వంగ అంటారని, తినేందుకు పనికిరావని రైతు కుప్పాల దుర్గారావు చెప్పారు. మార్కెట్‌లో ఈ మొక్కధర రూ.150 పలుకుతుందన్నారు. - న్యూస్‌టుడే, కడియం


క్రీడాకారులకు దిశా నిర్దేశం చేస్తున్న ఏఎస్ఎన్ మూర్తి

క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి

97 పాఠశాలల నుంచి 1400 మంది హాజరు

రాజానగరం, తుని, న్యూస్‌టుడే: రాజానగరం మండలం దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఈనెల మూడో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని సీబీఎస్ఈ క్లస్టర్ -7 పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని 97 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి 135 వాలీబాల్ జట్లు, సుమారు 1400 మంది క్రీడాకారులు, 150 మంది కోచ్‌లు, రిఫరీలుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 30 మంది హాజరవుతున్నారు. పోటీల పర్యవేక్షణకు సీబీఎస్ఈ దిల్లీ నుంచి పరిశీలకుడు వస్తున్నారు. ఈ మేరకు పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సీహెచ్. విజయప్రకాష్ బుధవారం మాట్లాడుతూ అతిథులందరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్నిరకాల వసతులు కల్పించామన్నారు. ప్రిన్సిపల్ ఏఎస్ఎన్ మూర్తి, క్రీడల సమన్వయకర్త గంగాధర్ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు దిశా నిర్దేశం చేశారు.

భళా.. నఖ చిత్ర కళ

గోటితో చిత్రాలు రూపొందిస్తున్న చిత్రకారుడు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆయనకు వేలి గోళ్లే కుంచెలవుతాయి. వర్ణాలు లేకుండానే ఆ చిత్రాలు సజీవ రూపాలుగా గోచరిస్తాయి. వాటిని గీస్తున్న చిత్రకారుడు కొవ్వూరు మండలం చిడిపికి చెందిన పరస రవి. 16వ శతాబ్దంలో తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాల్లో బోధనాంశంగా ఉన్న నఖ చిత్ర కళకు ఆ వైభవాన్ని తేవాలన్న సంకల్పం బూనారు. ప్రస్తుత చేతిరాత, వ్యక్తిత్వ వికాస నిపుణునిగా రాణిస్తున్నారు. సొంతూరిలో వ్యవసాయం చేస్తూ రాజమహేంద్రవరంలో ఉంటూ ఇంజినీరింగ్, మెడికల్, పీజీ కళాశాలల్లో విద్యార్థులకు చేతిరాతతోపాటు యువతను ముఖాముఖికు సన్నద్ధం చేస్తున్నారు.

ప్రముఖుల జయంతులు, పండుగల వంటి పర్వదినాల సందర్భాల్లో వాటి ప్రాధాన్యం తను తెలిపేలా వేలాది చిత్రాలు వేశారు.

అవార్డులు, ప్రశంసలు..

ఈయన విన్నూత్న రూపాల్లో గణపతి చిత్రాలను గీసి తెలుగు, భారత్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం పొందారు. 2018 ఉగాది పురస్కారాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అందుకున్నారు. 2016లో కాలిఫోర్నియాలోని బర్కిలీ విశ్వవిద్యాలయం 'గౌరవ డాక్టరేట్' ప్రదానం చేసింది.

3,910 గణపతులు..

అచ్చులు, హల్లుల్లోని ప్రతి అక్షరం స్ఫురించేలా పలు గణపతి చిత్రాలను గీశారు రవి. 13 సంవత్సరాలుగా నఖ చిత్రాలు గీస్తున్న ఆయన ఇప్పటివరకు 3,910 గణపతి చిత్రాలకు రూపమిచ్చారు. 1,200 వరకు ఓంకార, శివుడితో ఉన్నట్లుగా 800, వల్లభ, లక్ష్మీగణపతి ఇలా 32 రూపాల్లో గణపతులను అవలీలగా గీశారు. దినోత్సవాలు,


రవి గోటితో గీసిన చిత్రాలు..


మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడితో పరస రవి (పాత చిత్రం)

'గోటి చిత్రాలు- మేటి రాతలు' పేరుతో 12 రోజులపాటు ద్వాదశ జ్యోతిర్లింగాలను గీశారు. విదేశాలలో సైతం ఈ నఖ చిత్రాలు ఆదరణను చూరగొన్నాయి. నఖచిత్ర కళలో ప్రతిభ కనబర్చి ఇప్పటివరకు 17 బిరుదులు అందుకున్నారు. గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, కళాతపస్వి కె.విశ్వనాథ్, పాటల రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కంచి పీఠం స్వాములు, వివిధ హోదాల్లో ఉన్న వారి చిత్రాలను గీసి స్వయంగా వారికి అందించి మన్ననలు పొందారు. గాయకుడు బాల సుబ్రహ్మణ్యంకు చిత్రం గీసి ఇవ్వగా ఆయన ఎంతో ఆనందపడి రవిని సన్మానించారు.

పూర్వవైభవం తేవాలని..

నాకంటూ ఓ ప్రత్యేకత కోసం నఖ చిత్రాలను గీయడం అలవర్చుకున్నా. చదువొక్కటే కాకుండా విద్యార్థులకు ఇష్టమైన అంశాల్లో ప్రావీణ్యం పెంచాలి. వారిలో ఉన్న సృజనను ఆదరించాలి. విద్యార్థులకు వీటిని నేర్పిస్తూ ఈ కళకు పూర్వవైభవం తేవాలని శ్రమిస్తున్నాను.

- పరస రవి

మెట్టలో పిడుగుల వాన


కిర్లంపూడి మండలం చిల్లంగిలో కొబ్బరి చెట్టుపై పిడుగు

ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి: మెట్టప్రాంతంలో బుధవారం భారీ వర్షం కురిసింది. రెండు గంటలపాటు ఏకధాటిగా ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి తోడు పలుచోట్ల పిడుగులు పడి బెంబేలెత్తించాయి. మండలాల్లో పిడుగుపాటుకు కొబ్బరిచెట్లు నిలువెల్లా కాలిపోయాయి. ఏలేశ్వరం మండలం లింగవరం కాలనీ హైస్కూల్ వెనుక వీధిలో, ప్రత్తిపాడులో ఆసుపత్రి ఉన్న కొండపైన పిడుగులు పడ్డాయి. రోజంతా తీవ్రంగా ఎండ కాయగా, రాత్రి ఏడు గంటల నుంచి రెండు గంటలపాటు ఆకాశానికి చిల్లుపడినట్లుగా వర్షం కురిసింది. విద్యుత్తు సరఫరాను నిలిపేశారు. ప్రత్తిపాడు సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. మరమ్మతులు చేసేందుకు వాతావరణం సవాల్‌గా నిలిచింది. మెరుపుల వెలుతురులు, వానహోరు రెండు గంటల పాటు కొనసాగడంతో ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించింది.

ఆధ్యాత్మిక క్షేత్రం.. అంధకారమయం


క్షేత్ర ప్రవేశ మార్గంలో చీకటి

జిల్లాలో పురాణ ప్రాశస్త్యం సంతరించుకున్న వాటిలో కొవ్వూరు గోష్పద క్షేత్రం ఒకటి. ఆధ్యాత్మిక, ఆహ్లాదకరమైన ప్రదేశం. ఇక్కడి పవిత్ర గోదావరిలో స్నానమాచరించాలని భక్తజనం కోరుకుంటారు. ఇతర రాష్ట్రాల నుంచి సైతం యాత్రికులు ప్రత్యేక బస్సులు, వాహనాల్లో ఇక్కడికి వస్తుంటారు. ఇంత ప్రాముఖ్యతగల క్షేత్రాన్ని మౌలిక సదుపాయాల లేమి పట్టి పీడిస్తోంది. ప్రధానంగా క్షేత్రంలో ప్రవేశించే రెండు మార్గాల్లో విద్యుద్దీపాలు సరిగా వెలగడం లేదు. రాత్రయితే ఈ ప్రదేశం చీకటిమయంగా మారుతోంది. ఇక్కడికి వచ్చే వాహనానికి ఉన్న వెలుగే ఆధారంగా మారుతోంది. ప్రధాన రేవు పొడవునా ఉన్న హైమాస్టు స్తంభాలకు అన్నివైపులా ఉన్న దీపాలు వెలగడం లేదు. పిండాల రేవు సమీపంలోనూ ఇదే పరిస్థితి. దీంతో రాత్రి వేళల్లో కొందరు ఆకతాయిలు ఇక్కడికి చేరుతున్నారు. గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తున్న సమయంలో రేవు, మెట్లు ఎలా ఉన్నాయో కూడా కనిపించక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పూర్తిస్థాయిలో విద్యుద్దీపాలు వెలిగించేలా యంత్రాంగం శ్రద్ధ చూపాలని సర్వత్రా కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌ను వివరణ కోరగా విద్యుత్తు దీపాలకు అవసరమైన మరమ్మతులు చేపడతామన్నారు.

- న్యూస్‌టుడే, కొవ్వూరు టౌన్

శ్రీపీఠంలో మహాశక్తి యాగం


ఏర్పాట్లు పరిశీలిస్తున్న పరిపూర్ణానందస్వామి

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణం రమణయ్యపేట శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి 13 వరకు మహాశక్తియాగం నిర్వహించనున్నట్లు పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. బుధవారం శ్రీపీఠం గోశాలలో మహాశక్తియాగం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. తెలుగు రాష్ట్రాల నుంచి రోజూ 35 వేల మందికిపైగా మహిళా భక్తులు ఎరుపు వర్ణ ఏకరూప దుస్తులతో కుంకుమ పూజలు చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. 10వ దుర్గాష్టమి రోజు అధిక సంఖ్యలో భక్తులు శ్రీలలిత సహస్రవిరాట్ పారాయణ, పూజలు చేస్తారన్నారు. 9న మూలా నక్షత్రం పురస్కరించుకుని సుమారు 24 వేల మంది విద్యార్థులు 3 కోట్ల మహాసరస్వతి అనుష్టానం పూజలు చేయడానికి ఇప్పటికే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. అమ్మవారికి రోజు కొక అలంకరణ, బగళాముఖి హోమాలు శాంతికర కల్యాణం కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దసరా ఉత్సవాల్లో సుమారు 4 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ చేస్తామని చెప్పారు. తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీపై మాట్లాడుతూ వివాదం కోర్టు పరిధిలో ఉన్నందున ఎటువంటి వ్యాఖ్యలు చేయనని, కోర్టు తీర్పు వచ్చిన తర్వాత స్పందిస్తానని తెలిపారు.

ఖైదీల్లో పరివర్తన రావాలి


ఖైదీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

దానవాయిపేట (రాజమహేంద్రవరం): కారాగారాల్లోని ఖైదీల్లో పరివర్తన తీసుకువచ్చే దిశగా జైలు అధికారులు కృషి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం కారాగారంలోని మహిళా జైలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా తొలుత బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జైలులో మహిళా ఖైదీలకు అందుతోన్న వసతులపై ఆరా తీశారు. ఖైదీలకు నిర్వహించిన ఆటపాటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఖైదీల పిల్లలకు బొమ్మలు, దుస్తులు, పుస్తకాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళా జైలు ఆశ్రమ వాతావరణంలో ఉన్నట్లు ఉందన్నారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీల రిలీజు విషయాల్లో సిఫార్సు చేస్తామని తెలిపారు. ఖైదీల సమస్యలు, వారి కేసులు వివరాలు డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకు రావాలన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు, అధికారులు విజయకుమారి, డాక్టర్ లక్ష్మి సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో జైళ్ల శాఖకు ఆదాయం

కేంద్ర కారాగారాల్లో వృత్తివిద్యా శిక్షణ పొందడం ఖైదీలకు ఆర్థిక భరోసాగా ఉంటుందని గంధం సునీత అన్నారు. పురుషుల జైలులో నిర్వహించిన కార్యక్రమంలోనూ ఆమె పాల్గొన్నారు. శిక్షణ పొందడం ద్వారా ఖైదీలు బయటకు వెళ్లిన తరవాత జీవనోపాధి మార్గం లభిస్తుందన్నారు. జైళ్ల శాఖలకూ ఆదాయం సమకూరుతుందన్నారు. ఇటీవల పలు కోర్టులకు సంబంధించి రూ.60 లక్షల విలువ చేసే ఫర్నిచర్‌ను జైళ్లశాఖ ద్వారా కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఆర్.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు


కార్ల్ టెర్జాగి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వీసీ తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జియో టెక్నికల్ ఇంజినీరింగ్ పితామహుడు కార్ల్ టెర్జాగి జీవితం ఆదర్శనీయమని జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే ప్రాంగణంలో బుధవారం జియో టెక్నికల్ ఇంజినీరింగ్ పితామహుడు కార్ల్‌టెర్జాగి జయంతిని పురస్కరించుకుని ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. యూసీఈకే సివిల్ ఇంజినీరింగ్, ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ (ఐఎన్‌జి)కాకినాడ చాప్టర్, అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజినీర్స్ (ఏసీసీఈ) కాకినాడ చాప్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ హాజరై మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో వాతావరణానికి అనుగుణంగా చాలా నేలల స్వభావంలో మార్పులు వస్తున్నాయన్నారు. సివిల్ ఇంజినీర్లు వీటిని దృష్టిలో పెట్టుకుని తమ పరిశోధనలు చేయాలన్నారు. ప్రొఫెసర్ బీఆర్.ఫణికుమార్, ఏసీసీఈ కాకినాడ చాప్టర్ ఛైర్మన్ బాదం సుందరరావులు నేలల స్వభావం, సంభవిస్తున్న మార్పులు, జాగ్రత్తలు వివరించారు. రెక్టార్ కేవీ.రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎన్.మోహనరావు, వైస్ ప్రిన్సిపాల్స్, ఐజీఎస్ కాకినాడ ఛాపర్ట్ గౌరవాధ్యక్షుడు, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ఉండ్రాజవరం: మండలంలోని మోర్తకు చెందిన పదహారేళ్ల బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం... పదో తరగతి వరకు చదివిన ఆమె తణుకులోని ఓ ఆసుపత్రిలో పని చేస్తోందన్నారు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద, పరిసరాల్లోని వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తల్లి బుధవారం ఉదయం తమకు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.5.86 లక్షల ఆయిల్ స్వాధీనం

మామిడికుదురు: పాశర్లపూడిలంకలో 47 పీపాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.5.86 లక్షల విలువైన సాల్వెంట్ ఆయిల్‌ను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి అదే గ్రామానికి చెందిన రాచకొండ వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చైతన్యకుమార్ బుధవారం తెలిపారు. ఏవిధమైన అనుమతులు లేకుండా తెచ్చిన 9,400 లీటర్ల ఆయిల్‌ను పౌరసరఫరాల శాఖకు అప్పగించామన్నారు. డీటీ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు చెప్పారు.

మహాత్ముల బాటలో పయనిద్దాం

రాజమహేంద్రవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ మహాత్ముల బాటలో పయనించాలని, వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్వరాజ్యం, స్వచ్ఛభారత్ కోసం గాంధీజీ కలలు కన్నారన్నారు. ఆయన కలలు సాకారం చేసే దిశగా అందరం కృషి చేద్దామన్నారు. పరిసరాల పరిశుభ్రతపై వ్యక్తిగత దృష్టి సారించాలన్నారు. జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ గాంధీజీ జీవితం గురించి భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి జ్యోతి, కలెక్టరేట్ సిబ్బంది, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.


గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించిన అనంతరం మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భాస్కరరావు సేవలు నేటి వైద్యులకు ఆదర్శప్రాయం


యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల, నల్లమిల్లి.. చిత్రంలో భాస్కరరావు, దగ్గుబాటి, యార్లగడ్డ

రాజానగరం, న్యూస్‌టుడే: అత్యాధునిక వైద్య సేవలను పేదలకు అతి తక్కువ ఖర్చుకే అందిస్తున్న జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల అధినేత డా గన్ని భాస్కరరావు సేవలు నేటి యువ వైద్యులకు ఆదర్శప్రాయమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాల, ఆస్పత్రిలో ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి శ్రీనివాసు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీ దగ్గుబాటి వెంకటేశ్వరరావుతో కలసి క్రిటికల్ కేర్ సెంటర్, జనరల్ వార్డులను, డిజిటల్ లేప్రోస్కోపిక్ సర్జికల్ యూనిట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ డా. గన్ని అతి తక్కువ ఫీజుకే రోగులకు వైద్య సేవలందించడమే గాకుండా రూ. పదికే అమ్మ భోజనం, రూ. ఐదులకే ఇడ్లీ అందజేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ తన జీవితానికి తొలి గురువు డా.భాస్కరరావే నన్నారు. గోరంట్ల మాట్లాడుతూ సమాజం కోసం, పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడం కోసం డా.గన్ని చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మాజీ ఎంపీలు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, యార్లగడ్డ లక్ష్మీపతిరావు పాల్గొన్నారు.

మహాలయ అమావాస్య.. పిండ ప్రదానాలు

పిఠాపురం, న్యూస్‌టుడే: మహాలయ అమావాస్య కావడంతో బుధవారం తెల్లవారుజాము నుంచే పితృ దేవతలకు పిండ ప్రదానాలు నిర్వహించేందుకు పిఠాపురం పాదగయ క్షేత్రంలో భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. హోటళ్లు సైతం నిండుకున్నాయి. మొత్తం 2,500 మంది పిండ ప్రదానాలు చేశారు. పాదగయ కూడలిలో ట్రాఫిక్ సమస్య తలెత్తగా పోలీసులు రంగంలోకి దిగి నియంత్రించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పలువురు రాజకీయ నాయకులు పిండ ప్రదానాలు చేశారు. దర్శనాలు, సేవలు, ప్రసాదాలు, అన్న ప్రసాద విరాళాలు, వసతి, పిండ ప్రదాన టిక్కెట్ల రూపంలో రూ.5,89,029 ఆదాయం సమకూరిందని ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

సిబ్బంది 'సహకారం' స్వాహా!

రుణాలు చెల్లించకుండా దస్తావేజులు, పాసుపుస్తకాలు పట్టుకుపోయిన వైకాపా శ్రేణులు


వెదుళ్లపల్లి సొసైటీ

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం మండలం వెదుళ్లపల్లి సొసైటీకి సంబంధించి గత మూడున్నరేళ్లుగా సుమారుగా రూ.90లక్షలకు పైబడి నిధులు సిబ్బందితో కలిసి గల్లంతు చేసినట్లు తాజాగా బయటపడింది. సొసైటీ నిధులు గల్లంతు అయినట్లు డీసీసీబీ స్థాయి అధికారులు గుర్తించినా ఇంకా వైకాపా నాయకులే చక్రం తిప్పడంతో నిధుల స్వాహా బయటకు రాకుండా చూసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలోని ఒక ఆడిటర్ అవకతవకల్లో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలిసింది. పంటరుణాలపై తీసుకున్న రుణాలు చెల్లించినా సొసైటీకి జమచేయకుండా లబ్ధిదారుల వాటామూలధనం సైతం అంతా కలిసి మింగేశారు. కొంతమంది వైకాపా నాయకులు సొసైటీలో రుణాలు తీసుకునే సమయంలో ఉంచిన పట్టాదారు పాసుపుస్తకాలు, దస్తావేజులను సైతం తీసుకుపోయి వేరే బ్యాంకుల్లో తిరిగి రుణాలు తీసుకున్నట్లు చెబుతున్నారు. సొసైటీలో సీఈవోగా పనిచేస్తున్న మట్టా సురేంద్ర మరో ఇద్దరి సిబ్బందితో కలిసి నిధులు గల్లంతు చేసినట్లు ఇప్పటికే అధికారికంగా గుర్తించి అధికారులు నివేదికలు సైతం ఇచ్చినా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చర్యలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత కూడా కాకినాడ కేంద్రంగానే డీసీసీబీ నడుస్తోంది. కాగా నిధుల గల్లంతుపై రఘుదేవపురం డీసీసీబీ బ్రాంచి మేనేజరు మిడియం క్రాంతి కృష్ణను బుధవారం 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సొసైటీలో నిధులు గల్లంతుకు పాల్పడిన సీఈవో సురేంద్రపై కాకినాడ డీసీసీబీకి నివేదికలు అందించామన్నారు. ఆ తర్వాత కొంత సొమ్మును సీఈవో బ్యాంకుకు జమచేశారని ఇంకా సుమారుగా రూ. 50లక్షలకు పైబడి గోల్‌మాల్‌గా ఉందన్నారు. జమచేసిన రైతులకు రశీదులు సైతం ఇవ్వకపోవడం ఇతరత్రా రికార్డులు లేకపోవడంపై సమగ్ర విచారణ చేపడతామన్నారు.

ఖాదీకి పూర్వవైభవం తీసుకురావాలి


సరస్వతీ ఘాట్‌లోని భారతమాత విగ్రహం వద్ద మహిళలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: ఖాదీ వస్త్రాలకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరుతూ మహిళలతో ఖాదీ వాక్ నిర్వహించామని ఆంధ్రకేసరి యువజన సమితి ప్రధాన కార్యదర్శి మాదిరాజు శ్రీనివాస్ తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఉదయం కోటిపల్లి బస్టాండ్‌లోని స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో ప్రారంభించిన ఈ వాక్‌లో ఆయన మాట్లాడారు. ఖాదీ ఉద్యమాన్ని గాంధీజీ ప్రారంభించి 106 ఏళ్లు అయిన సందర్భంగా 106 మంది మహిళలచే ఖాదీ వస్త్రాలపై అవగాహన కోసం ఈ వాక్ నిర్వహించామన్నారు. పార్కు నుంచి మొదలైన ర్యాలీ సరస్వతీఘాట్‌లోని భారతమాత విగ్రహం వరకు సాగింది. ఖాదీ వస్త్రాల తయారీలో ప్రధానమైన చరఖా పట్టుకుని.. ఖాదీ చీరెలు ధరించిన మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. లేడీస్ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్, లయన్స్ క్లబ్, వాసవీ క్లబ్, భక్తబృందం సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో దేశిరెడ్డి బలరామ నాయుడు, పిల్లి నిర్మల, దూర్వాసుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	12,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-15,500
కొత్త (పచ్చి) కాయ	14,000-14,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	116-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్డ్	200-00
స్కిన్‌లెస్	228-00

మాయమాటలు చెప్పాడు.. రూ.కోటితో ఉడాయించాడు..

రాజమహేంద్రవరంలో ఘరానా మోసం

రాజమహేంద్రవరం నేరవార్తలు: ఇంటి స్థలం, ఇళ్లు, ఉద్యోగం ఇప్పిస్తామని మాయమాటలు చెప్పాడు.. భాగస్వామ్యంతో వ్యాపారాలు చేయిస్తానని నమ్మించాడు.. అలా పలువురి నుంచి సుమారు రూ. కోటి మేర వసూలు చేసి కుటుంబంతో సహా ఉడాయించాడు.. బాధితులంతా రాజమహేంద్రవరం మూడో పట్టణ స్టేషన్‌లో ఆశ్రయించడంతో విషయం వెలుగుచూసింది.. సీఐ వి.అప్పారావు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని 38వ డివిజన్ సీతంపేట సచివాలయంలో ఏఎన్ఎంగా అర్జిశాంత సరోజిని గత అయిదేళ్లుగా పనిచేస్తున్నారు. 39వ డివిజన్ లింగంపేట సచివాలయం ఏఎన్ఎంగా కమిడి వరలక్ష్మి విధులు నిర్వర్తించేవారు. ఇద్దరి విధులు ఒక్కటే కావడంతో వీరభద్రపురం ప్రాంతంలో నివాసముంటూ రెండు కుటుంబాలు సన్నిహితంగా ఉండేవారు. వరలక్ష్మి భర్త మేడిబోడి తారకరామ సతీష్.. సరోజినికి ఇల్లు కొని ఇస్తానని మాయమాటలు చెప్పి విడతలు వారీగా సుమారు రూ.13.25 లక్షల నగదు, పది కాసుల బంగారం తీసుకున్నాడు. అనంతరం సతీష్ ఫోనుకు అందుబాటులో లేకపోవడం.. గత నెల 29వ తేదీ నుంచి అతడి భార్య వరలక్ష్మి, పిల్లలతో కలసి ఇంటికి తాళం వేసి వెళ్లిపోవడంతో సరోజినికి అనుమానం వచ్చింది. సతీష్ ఆచూకీ కోసం పూర్తిస్థాయిలో ఆరా తీయగా అసలు విషయం వెలుగుచూసింది. అతడు ఇళ్లు, ఇంటి స్థలాలు, ఉద్యోగాలు ఇప్పిస్తానని, వ్యాపారాలు చేయిస్తానని పలువురి వద్ద రూ.కోటి వరకు తీసుకుని మోసగించినట్లు గుర్తించారు. ఆ క్రమంలో బాధితులందరూ కలసి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సరోజినితో పాటు.. 39వ డివిజన్‌లోని పొడుగు శ్రీనివాసరావు వద్ద నుంచి ఇంటి స్థలం, బంగారం వ్యాపారం చేద్దామని చెప్పి విడతల వారీగా రూ.21 లక్షలు.. 37వ డివిజన్‌కి చెందిన నేతి సత్యనారాయణమూర్తికి ఇంటి స్థలం పేరుతో రూ.11లక్షలు.. భాగస్వామ్యంతో పాత ఇనుము వ్యాపారం చేద్దామని చెప్పి లింగంపేటకు చెందిన బంటిపల్లి శ్రీనివాస్ వద్ద రూ.18 లక్షలు.. అదే ప్రాంతానికి చెందిన బంటిపల్లి హరిబాబు వద్ద రూ.8లక్షలు.. లింగంపేటకి చెందిన షేక్ అబ్దుల్ ఇర్ఫాన్ ఖాన్ వద్ద ఇంటి స్థలం పేరుతో రూ.8లక్షలు.. 41వ డివిజన్‌కు చెందిన ముంగుడ ఉదయ సత్యకిరణ్‌కు రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.3.20లక్షలు, లింగంపేటకు చెందిన దుక్కర నాగమణికి బంగారం గొలుసు చేయిస్తానని చెప్పి రూ.30వేలు నగదు తీసుకుని పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాజమహేంద్రవరం

దానవాయిపేట: శ్యామల, అనుశ్రీ, రాజా, వీఎస్ మహల్, అశోక, కుమారి, సూర్యప్యాలస్, అప్సర: దేవర. సూర్యమినీ, ఊర్వశి: సత్యం సుందరం, మేనక: మత్తు వదలరా-2, శివజ్యోతి: కళింగ, స్వామి: జోకర్, రంభ: 35 చిన్నకథకాదు.

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్: టమాట-45/చిన్నవి-40, వంకాయలు నలుపు-30/గులాబీ-40/తెలుపు-30/దొమ్మేరు-44, బెండ-32, కాకర-36, బీర పందిరి-34/30, దొండ-38, క్యారెట్-36, బీట్‌రూట్-32, గోరుచిక్కుళ్లు-36, దోస-32, ఆనబకాయ-25, చిక్కుళ్లు-60/దేశవాళీ-80, పచ్చిమిర్చి-23, బంగాళదుంపలు-34, ఉల్లిపాయలు-50/కొత్తవి-38.

చదరంగంలో విజేతలు వీరే

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో బుధవారం నగరంలో అండర్-9 చదరంగం పోటీలు జరిగాయి. ఈ పోటీలకు 45 మంది హాజరు కాగా.. ఐదు రౌండ్లలో పోటీలు నిర్వహించారు. ఓపెన్ విభాగంలో వై.శ్రీనిఖిల, ఎన్.శ్రీసాయి విభు, బాలికల విభాగంలో ఎ.వేదాన్షి, సీహెచ్.అనన్య విజేతలుగా నిలిచారని సంఘ కార్యదర్శి కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి


నిరసన దీక్ష చేస్తున్న కేంద్ర కార్మిక, రైతు, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను మానుకోవాలని కేంద్ర కార్మిక, రైతు, ప్రజాసంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. బుధవారం స్థానిక కోటిపల్లిబస్టాండ్ వద్ద ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందర్‌బాబు అధ్యక్షత వహించగా.. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ దీక్షాశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో ప్రాణత్యాగాల ఫలితంగా సాధించుకున్న విశాఖ ఉక్కును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాంబాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వసుధ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన


ప్రదర్శనలో వస్తువులు తిలకిస్తున్న నగర మహిళలు

దానవాయిపేట: నగరంలోని జేఎన్‌రోడ్డును ఆనుకుని ఉన్న జేకే గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ మహిళలను విశేషంగా ఆకట్టుకుంటోందని నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, సీతాకాంత్ తెలిపారు. దేశం నలుమూలల నుంచి ప్రఖ్యాతిగాంచిన సుమారు 50కు పైగా డిజైనర్లు రూపొందించిన వస్త్రాలు.. ఈ ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబయి, దిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ వంటి మహానగరాల నుంచి సరికొత్త డిజైనర్ వస్త్రాలను ఈ ప్రదర్శనలో పరిచయం చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 3వ తేదీ రాత్రి తొమ్మిది గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు.

దేవీచౌక్ ప్రాంతంలో ట్రాఫిక్ మళ్లింపు

దానవాయిపేట (రాజమహేంద్రవరం): దేవీచౌక్‌లో అమ్మవారి దసరా మహోత్సవాల నేపథ్యంలో గురువారం నుంచి 15వ తేదీ వరకు ట్రాఫిక్ మళ్లింపు చేస్తున్నట్లు ఎస్పీ డి.నరసింహాకిషోర్ తెలిపారు. కంబాలచెరువు జైలురోడ్డు నుంచి గోకవరం బస్టాండు వెళ్లవలసిన వాహనదారులు చిరంజీవి బస్‌స్టాండ్, స్వతంత్ర ఆసుపత్రి మీదుగా వెళ్లాలి. అలాగే గోకవరం బస్టాండు నుంచి జైలురోడ్డు వైపుగా వెళ్లాల్సిన వాహనదారులు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద నుంచి తుమ్మలోవ మీదుగా కంబాలచెరువు వైపుగా వెళ్లాలి. పేపరుమిల్లు నుంచి జాంపేటకు వెళ్లాల్సిన వాహనదారులు తుమ్మలోవ కంబాలచెరువు కూడలి మీదుగా వెళ్లాలి. జాంపేట నుంచి పేపరుమిల్లు వైపుగా వెళ్లాల్సిన వాహనాలు నందం గనిరాజు కూడలి మీదుగా కంబాలచెరువు వైపుగా వెళ్లాలి. మెయిన్‌రోడ్డు కోటగుమ్మం నుంచి కంబాలచెరువు కూడలికి వెళ్లాల్సిన వాహనాదారులు జెండా పంజారోడ్డు, జాంపేట మీదుగా వెళ్లాలని ఎస్పీ సూచించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

పిల్లలపై దృష్టి సారించండి

- ప్రభుత్వ బడుల్లో ఆగిన కంటి పరీక్షలు
- ప్రారంభానికి కూటమి ప్రభుత్వంపై ఆశలు

న్యూస్‌టుడే, శ్యామలసెంటర్

సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. మన కంటిచూపు బాగుంటేనే దేన్నైనా సాధించేందుకు తోడ్పాటు అందుతుంది. అందుకే చిన్నప్పటి నుంచే పిల్లల్లో ఉండే దృష్టి లోపాలను నివారించేందుకు ప్రభుత్వం ఏటా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లు, శస్త్రచికిత్సలు అందించేది. అయితే, గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఈ అంశంపై దృష్టి సారించకపోవడంతో పిల్లలు దృష్టి సంబంధ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ అవస్థ పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో ఈ పరీక్షలు పునరుద్ధరిస్తారన్న ఆశలు నెలకొన్నాయి.

ఇదీ పరిస్థితి

నగరంలో ప్రభుత్వ పాఠశాలలు		విద్యార్థులు
ఉన్నత పాఠశాలలు	21	8500
ప్రాథమిక స్థాయి	56	7450

రాజమహేంద్రవరం నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 16 వేలమంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అప్పుడప్పుడు కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల సిబ్బంది వైద్య శిబిరాల పేరిట పిల్లలను పరీక్షించి అవసరమైన వారికి మందులను అందజేస్తున్నారు. శస్త్రచికిత్సల్లో మన సొంత నిధులు వెచ్చించాల్సిందే. బాల్యంలో వచ్చే కంటి సమస్యలను త్వరగా గుర్తించకపోతే అంధత్వానికి దారి తీస్తాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో కంటి వెలుగు కార్యక్రమం తూతూ మంత్రంగా చేపట్టింది. పూర్తి స్థాయిలో ఫలితాలివ్వలేదు. గతంలో సమగ్రశిక్షా, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా లేదా కొన్ని ప్రైవేటు నేత్ర వైద్యశాలలు స్వచ్ఛందంగా పాఠశాలలకు వెళ్లి కంటి పరీక్షలు చేపట్టేవారు. ఉచితంగా మందులు ఇవ్వటం లేదా రాయితీతో కంటి శస్త్రచికిత్సలు చేసేవారు. గత ఐదేళ్లుగా ఆగిన ఆ ప్రక్రియను తిరిగి పట్టాలెక్కిస్తే బాగుంటుందన్న వాదన సర్వత్రా వ్యక్తమవుతోంది. పిల్లల తల్లిదండ్రులు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.


కంటిపూడి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

అంధత్వ నివారణకు కృషి

ప్రభుత్వ పాఠశాలల్లో నేత్ర పరీక్షలు గత కొన్నేళ్లుగా చేపట్టలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ప్రణాళికాబద్ధంగా పరీక్షలు జరుపుతాం. తద్వారా పిల్లల్లో అంధత్వ నివారణకు కృషి చేస్తాం.

- బి.దిలీప్‌కుమార్, డీఐ రాజమహేంద్రవరం.

నగరంలో మహాలయపక్ష సేవలు


వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేస్తున్న ఇండియన్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: ఆంధ్ర, తెలంగాణా పరిధిలోని ఇండియన్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహాలయ పక్షం సందర్భంగా పితృ తర్పణాలు, పిండ ప్రదానాలు నిర్వహించారు. అంతకు ముందు బ్రాహ్మణులకు దక్షిణ తాంబూలాలు అందించి ఆశీస్సులు పొందారు. ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ సుధాకరరావు చేతుల మీదుగా 100 మందికి చీరలు, లుంగీలు పంపిణీ చేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన సంఘం వ్యవస్థాపకులు ఎన్.వి.మురళీధర్ తమ సంఘం పరంగా జరుగుతున్న సేవలను వివరించారు. సుబ్రహ్మణ్యం, పప్పుశర్మ, వీరభద్రరావు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

✦ మహాలయ అమావాస్యతో పితృపక్షాలలో చివరిరోజు పూర్తవుతుందని శ్రీమహాలక్ష్మి సమేత చిన్నవెంకన్నబాబు పీఠం పీఠాధిపతి వెంకన్నబాబు స్వామీజీ అన్నారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో నిరుపేదలకు భోజనం, మంచినీరు పంపిణీ చేశారు. సింగంశెట్టి మహేష్, మద్ది శ్రీనివాసరెడ్డి, మజ్జి శ్రీకాంత్, మతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ మార్గం అనుసరణీయం

ఘనంగా బాపూజీ జయంతి వేడుకలు

రాజమహేంద్రవరం (నగరపాలక సంస్థ, టి.నగర్, సాంస్కృతికం, ఏ.వి.ఏ రోడ్డు, దేవీచౌక్, శ్యామలాసెంటర్, దానవాయిపేట, వి.ఎల్.పురం): గాంధీజీ మార్గం అనుసరణీయమని రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. గాంధీజీ జయంతి నేపథ్యంలో కంబాలచెరువు వద్ద మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన పోరాట స్ఫూర్తితో ఆంగ్లేయులను గడగడలాడించి, భారతదేశం స్వేచ్ఛావాయువులను పీల్చుకోవడానికి కృషి చేశారని కొనియాడారు.

✦ కమిషనర్ కేతన్ గర్గ్ మున్సిపల్ కార్యాలయంలో గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు నివాళి అర్పించారు. డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ, ఎస్ఈ పాండురంగారావు, ఎంహెచ్ఓ వినూత్న తదితరులు పాల్గొన్నారు.

✦ పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో తుమ్మలావలోని బ్రౌన్ మందిరంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ లండన్ యూనివర్శిటీలో విద్యార్థిగా ఉన్న సమయంలో ఆయన కాలేజీకి కట్టిన రసీదును ఫ్లెక్సీ రూపంలో యార్లగడ్డకు బ్రౌన్ మందిరం నిర్వాహకులు సన్నిధానం శాస్త్రి బహూకరించారు. ✦ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అధికారులు, ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ✦ ఆర్యాపురం ఎ.బి.నాగేశ్వరరావు పార్కులోని సీనియర్ సిటిజన్స్ డేకేర్ భవనంలో సీనియర్ సిటిజన్స్ ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో.. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో.. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమానికి ముందు గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. గాంధీపురం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలోనూ కార్యక్రమం జరిగింది. ✦ అలాగే, రాజమహేంద్రి మహిళా కళాశాల బృందం సీతంపేట సమీపంలో, సీతంపేట గ్రంథాలయంలో, టౌన్‌హాల్ జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ ఆధ్వర్యంలో, రాజమహేంద్రవరం ఆర్ట్స్ క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్ (రాకా) ఆధ్వర్యంలో.. రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షులు తవ్వల వీరేంద్రనాథ్ నేతృత్వంలోనూ మహాత్ముడికి నివాళి అర్పించారు. ✦ స్థానిక ఆర్అండ్‌బీ క్వార్టర్స్ ఆవరణలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో.. ఏపీ ఎన్జీవో సంఘ కార్యాలయంలో.. ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలోనూ నివాళులర్పించారు. ✦ గోకవరం బస్టాండ్ సమీపంలోని గాంధీజీ విగ్రహానికి మాజీ ఎంపీ భరత్‌రామ్, గూడూరు శ్రీనివాస్ తదితరులు నివాళి అర్పించారు. ✦ కంబాలచెరువు గన్ని కృష్ణ కార్యాలయంలో.. రాజమహేంద్రవరం సర్వజన ఆసుపత్రి ఆవరణలో సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.


గాంధీజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్


కమిషనర్ కేతన్ గర్గ్ నివాళి


లండన్ కళాశాలలో మహాత్మాగాంధీ కట్టిన ఫీజు రసీదు ఫ్లెక్సీ రూపంలో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు బహూకరించిన సన్నిధానం శాస్త్రి


చైతన్య గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు..



రాజమండ్రి బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో..

గోదారి తీరంలో దసరా సంబరాలు

అన్ని ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: గోదావరి తీరంలో దసరా సంబరాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. దక్షిణ కాశీగా పిలుచుకునే నగరంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ప్రధాన కేంద్రమైన దేవీచౌక్‌తో పాటు దేవాదాయశాఖ ఆలయాలు, ఇతర ఆలయాల్లోనూ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు జరిగే ఉత్సవాలు జరగనున్నాయి.

★ అత్యంత వైభవంగా నిర్వహించే దేవీచౌక్ ఉత్సవాలు గురువారం ఉదయం 8.40 గంటలకు కలశస్థాపనతో మొదలవుతాయి. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం కుంకుమ పూజలు, అమ్మవారికి అఖండ హారతి నిర్వహిస్తారు. ఉత్సవ కమిటీ నిర్వహణలో భక్తుల దర్శనానికి అనువుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

★ దేవాదాయశాఖ పరిధిలోని శ్రీఉమా మార్కండేయ స్వామి ఆలయంలో గురువారం 6.30 గంటలకు స్వామి, అమ్మవార్లకు అభిషేకం, విశేష పూజలు ఉంటాయి.

★ శ్రీఉమా కోటిలింగేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీభువనేశ్వరీదేవికి నిత్యం కుంకుమ పూజలు నిర్వహిస్తారు. గురువారం ఉదయం 8.15 గంటలకు కలశస్థాపనతో పూజలు ప్రారంభిస్తారు.

★ సరస్వతీఘాట్‌లో శ్రీజ్ఞాన సరస్వతీ పీఠంలో నిత్యం గణపతి పూజ, నవగ్రహ ఆరాధన, శ్రీచక్ర క్షీరాభిషేకం తదితరాలు జరుగుతాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా దసరా పదిరోజుల పాటు ఉదయం 10గంటలకు లక్ష దేశీ ఆవు పిడకలు, ఆవునెయ్యితో శ్రీసురభి - గోరక్షా దీక్షా యాగం నిర్వహిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఘాట్‌లోని కళావేదికపై సాయంత్రం 5.30గంటల నుంచి సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఉంటాయి.

★ గౌతమఘాట్‌లోని అక్షరకోటి గాయత్రీ పీఠంలో నిత్యం కుంకుమార్చన, విశేష అలంకారం ఉంటుంది.

★ వంకాయలవారి వీధిలోని అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవార్లకు అభిషేకం, విశేష కుంకుమ పూజలు ఉంటాయి. ఒక్కో అమ్మవారికి ఒక్కో రోజు ప్రత్యేక అలంకరణ ఉంటుంది.

★ గోదావరిగట్టున శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో కుంకుమార్చన, పారాయణతో పాటు.. మూలవిరాట్‌కు ఒక్కో రోజు ఒక్కో అలంకారంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



మార్కండేయస్వామి, సరస్వతీఘాట్‌లో కొలువైన పార్వతీదేవి, జ్ఞాన సరస్వతీదేవి


కనకదుర్గమ్మకు కలశాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు


కోటిపల్లి బస్టాండ్ వద్ద..

కనకదుర్గమ్మకు కలశాభిషేకం

రాజమహేంద్రవరం పేపరుమిల్లు రోడ్డులో చింత చెట్టు పక్కన ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తబృందం హాజరై పూజారి కె.సోమసుందరం నిర్వహణలో అమ్మవారికి కలశాభిషేకం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.ప్రసాద్, టి.కె.విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

★ దేవీ నవరాత్రులను పురస్కరించుకుని నగరంలోని పలు కూడళ్లు మండపాలు, విద్యుద్దీపకాంతులతో వెలుగులీనుతున్నాయి. నిర్వాహకులు సుందరంగా ముస్తాబు చేశారు.

సమస్యల పరిష్కారానికి సత్యాగ్రహ దీక్ష



పాదయాత్ర చేస్తున్న జన సైనికులు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ టీచర్ల యూటీఎఫ్ ఆధ్వర్యంలో నగరంలోని దండిమార్చ్ వద్ద బుధవారం సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, వివిధ కేడర్లలో టీచర్ పోస్టులు అప్‌గ్రేడ్ చేయకపోవటం వంటి సమస్యలు ఉన్నాయన్నారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

జనసైనికుల ప్రాయశ్చిత్త పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న జన సైనికులు

ఏ.వి.ఏ రోడ్డు, న్యూస్‌టుడే: పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా కంబాలచెరువు వద్ద నుంచి దేవిచౌక్ వరకు జన సైనికులు బుధవారం ప్రాయశ్చిత్త పాదయాత్ర చేశారు. అనంతరం ఆలయంలో కీర్తనలతో భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వై.శ్రీను మీడియాతో మాట్లాడుతూ.. వైకాపా పాలనలో హిందూ ధర్మం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. జామి సత్యనారాయణ, నరసింహమూర్తి తదితరుల పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం సందర్శించిన పురందేశ్వరి

బొమ్మూరు: బొమ్మూరులోని మహారోగి ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీ పురందేశ్వరి బుధవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న కార్యక్రమాలు, ఆసుపత్రిలో వైద్య సేవలను అధికారులు వివరించారు. రోగులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

నర్సరీల్లో దొంగల హల్‌చల్

కడియం, న్యూస్‌టుడే: కడియం మండల నర్సరీ రైతులు రాగితీగల చోరులతో బెంబేలెత్తుతున్నారు. రూ.లక్షలాది విలువ చేసే విద్యుత్తు మోటార్లకు అమర్చిన రాగితీగలను రాత్రి వేళ నర్సరీల్లో చొరబడి తీగల మధ్య ఉన్న రాగిని తస్కరిస్తూ కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాగితీగలు తీసేసి విద్యుత్తు తీగలను అక్కడే పడేసి వెళ్లిపోతున్నారన్నారు. మొక్కలకు అవసరమైన నీళ్ల తడికి విద్యుత్తు తీగలను తిరిగి సరిచేసేందుకు రూ.5 నుంచి రూ.10వేలు చొప్పున ప్రతి రైతుకు చేతి చమురు వదులుతుందన్నారు. కాగా కడియం సీఐ వెంకటేశ్వరరావును ఈ చోరీలపై వివరణ కోరగా ఇప్పటి వరకూ ఎలాంటి ఫిర్యాదు అందలేదని, నర్సరీరైతులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే తప్పనిసరిగా నిఘా పెట్టి చోరీలకు అడ్డుకట్ట వేస్తామన్నారు.

800 గ్రాముల గంజాయి స్వాధీనం

రాజానగరం: చక్రద్వారబంధంలోని రాకీ అవెన్యూస్ నందు 800 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని రాజానగరం సీఐ ఎస్.పి. వీరయ్యగౌడ్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాకీ అవెన్యూస్‌లో గల చంద్రిక, అవంతికలో యమున బ్లాక్ నందు మూడో ఫ్లోర్‌లోని ఓ గదిలో పరిశీలించారు. అక్కడ మిట్టని సాయికుమార్, కట్టమూరి యశ్వంత్, దుర్గాడ పండు(మహేష్) కలసి గది అద్దెకు తీసుకుని గంజాయి తాగే అలవాటు ఉన్న యువకులను ఇక్కడకు పిలిచి వారికి విక్రయిస్తున్నారు. నిందితులు ముగ్గురిని కోర్టుకు తరలించామని వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు.



గోదావరి రైల్వేస్టేషన్ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో సోము వీర్రాజు, ఆదిత్య ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు



రైల్వేకాలనీ వద్ద మొక్కలు నాటుతున్న స్కౌట్ అండ్ గైడ్స్

స్వచ్ఛత.. అందరి బాధ్యత



ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రచారం

దేవీచౌక్, టి.నగర్, వి.ఎల్.పురం, రాజమహేంద్రవరం సాంస్కృతికం, బొమ్మూరు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా పలు కార్యక్రమాలు జరిగాయి. గోదావరి రైల్వేస్టేషన్‌లో భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, ఇతర నాయకులు, విద్యార్థులతో కలిసి స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం తొలగించి శుభ్రం చేశారు. రాజమహేంద్రవరం ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సి.హెచ్.ముత్యాలరావు ఆధ్వర్యంలో రైల్వేకాలనీ, స్కౌట్ డెన్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పేపరుమిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముఖేష్‌జైన్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) ఎం.సూరారెడ్డి ఆధ్వర్యంలో ఆ సంస్థ ఉద్యోగులు ఉమామార్కండేయేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న గోదావరి ఘాట్‌లో వ్యర్థాలు తొలగించారు. కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి బొమ్మూరులో చెత్త సంపద కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. స్వచ్ఛతపై ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. త్వరలో స్వచ్ఛ బొమ్మూరుగా మారాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యర్థాలు కాలువల్లో వేయడం వల్లే పారిశుద్ధ్యం దెబ్బతింటోందన్నారు. అనంతరం జిల్లాలో పలు విభాగాల్లో సేవలందించిన వివిధ గ్రామాల కార్యదర్శులు, శానిటరీ సిబ్బందిని సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

పొంచి ఉన్న ప్రమాదం


ప్రమాదకరంగా ఉన్న పలకలు

ఏ.వి.ఏ రోడ్డు, న్యూస్‌టుడే: స్థానిక ఏ.వి.ఏ రోడ్డు గల లారెల్ కిడ్స్ పాఠశాల వద్ద రోడ్డు నడిమధ్యన విరిగిన పలక సుమారు మూడు నెలల నుంచి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. పాదచారులు, వాహనదారులు అప్రమత్తంగా లేకుంటే ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఏర్పడింది. పిల్లలు పొరపాటున అందులో పడితే ప్రాణాలకు ప్రమాదమే. . అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రాజమహేంద్రవరం గ్రామీణం
• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

విద్యుత్తు భద్రతపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

కోరుకొండ: ప్రజలందరూ విద్యుత్ భద్రత, సూచనలు పాటించాలని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ కోరారు. కోరుకొండ విద్యుత్తు సబ్‌స్టేషన్ ఆవరణలో బుధవారం జరిగిన భద్రతా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిబ్బంది ప్రకృతులతో అవగాహన కల్పించారు. డీఈఈ వెంకటేశ్వరరావు, ఏఈలు మదర్సా, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సినిమాలు

దానవాయిపేట: శ్యామల, అనుశ్రీ, రాజా, వీవీస్ మహల్, అశోక్, కుమారి, సూర్యప్యాలెస్, అప్సర: దేవర. సూర్యమిని, ఊర్వశి: సత్యం సుందరం, మేనక: మత్తు వదలరా-2, శివజ్యోతి: జిలంగ, స్వామి: జోకర్, రంభ: 35 చిన్నకథకాదు

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్: టమాట-45/చిన్నవి-40, వంకాయలు నలుపు-30/గులాబీ-40/తెలుపు-30/ దొమ్మేరు-44, బెండ-32, కాకర-36, బీర పందిరి-34/30, దొండ-38, క్యారెట్-36, బీట్‌రూట్-32, గోరుచిక్కుడు-36, దోస-32, ఆనపకాయ-25, చిక్కుడు-60/దేశవాళీ-80, పచ్చిమిర్చి-23, బంగాళదుంపలు-34, ఉల్లిపాయలు-50/కొత్తవి-38

మేమున్నాం.. మీకు తోడుగా

రహదారి చెంత చెత్త కుప్పలు

సమస్య: పిడింగొయ్యి పంచాయతీ పరిధి వెంకటగిరి కాలనీ పాఠశాల సమీపంలో రహదారి చెంతనే చెత్త కుప్పలు అప్పట్లో స్వర్గం ఉన్నాయి. పందులు గుంపులుగా చేరుతున్నాయి.
- కె.సరోజ, స్థానికురాలు

సమాధానం: సిబ్బందిని పంపిస్తాం. చెత్త కుప్పలు తొలగించి ఆయా ప్రాంతాల వారికి ఇబ్బంది లేకుండా చేస్తాం.
- రూపచంద్, పిడింగొయ్యి పంచాయతీ కార్యదర్శి

తాగునీటి వృథా

సమస్య: స్థానిక హుకుంపేట పంచాయతీ పరిధి పాల కేంద్రం వీధిలో పలు చోట్ల తాగునీటి పైపులు పగిలి నీరు వృథాగా పోతుంది.
- స్థానికుడు, ఎం.రాజేష్

సమాధానం: తాగునీటి పైపులు మరమ్మతులు చేపట్టి వృథాను అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటాం.
- కాశీ, హుకుంపేట ఇన్‌ఛార్జ్ కార్యదర్శి
- న్యూస్‌టుడే, హుకుంపేట

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

రాష్ట్రస్థాయి పోటీలకు పందలపాక విద్యార్థులు


ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

బిక్కవోలు, న్యూస్‌టుడే: పందలపాక జడ్పీ ఉన్నత పాఠశాల, మహాత్మా జూనియర్ కళాశాలకు చెందిన క్రీడాకారులు పది మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు యువరాజా రెడ్డి బుధవారం తెలిపారు. కాకినాడలో జరిగిన జిల్లాస్థాయి ఖోఖో, వాలీబాల్, స్విమ్మింగ్, హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్-19, 17, 14 విభాగాల్లో బాలికలు ప్రతిభ చూపారన్నారు. ఈ విద్యార్థులు భవాని, దివ్య, శశి, లోహిత, ప్రియ, సుస్మిత, జాహ్నవి, ఉమావైష్ణవి, లీలా తేజస్విని, సంతోషిలను ఉపాధ్యాయులు అభినందించారు.

తొలగించకుంటే ప్రమాదమే!

రాజమహేంద్రవరం విమానాశ్రయం కార్గో టెర్మినల్ ముఖద్వారం వద్ద విద్యుత్తు స్తంభం ప్రమాదాన్ని సూచిస్తోంది. ఇక్కడ విద్యుత్తు స్తంభానికి పిచ్చిమొక్కలు, తీగలు చుట్టుకున్నాయి. విద్యుత్తు సరఫరా అయ్యే తీగలకూ ఇవి అల్లుకుని ఉండటంతో మరింత ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, కోరుకొండ


విమానాశ్రయం కార్గో టెర్మినల్ ముఖద్వారం వద్ద విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న తీగలు

పశు బీమా.. పాడికి ధీమా

• రైతు చెల్లించే ప్రీమియంలోనూ రాయితీ • పథకాల పునరుద్దరణ దిశగా ప్రభుత్వం



ఈ చిత్రంలో కనిపిస్తున్న పేరిచర్ల వెంకట్రాజుది సీతానగరం స్వగ్రామం. ఎడ్లబండిపైనే ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు 3న భారీ వర్షాల నేపథ్యంలో పంటచేలల్లోకి ఎరువుల బస్తాలను వేసుకుని చీపురుపల్లి అద్దెకు వెళ్లారు. వచ్చేదారిలో కల్వర్టు వేగంగా ప్రవహిస్తుండటంతో బండి కొట్టుకుపోయి ఒక ఎద్దు అక్కడే చనిపోయింది. రూ.లక్షకు పైబడి విలువ చేసే ఎద్దును కోల్పోయిన రైతు పరిహారం కోసం పశుసంవర్ధకశాఖకు తన గోడు వినిపించారు. గత వైకాపా ప్రభుత్వం అప్పటికే పాడిసంపదపై ఉన్న పథకాలన్నీ రద్దు చేయడంతో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ఒక్క వెంకట్రాజే కాదు.. పాడిసంపదను కోల్పోయిన ఎంతోమంది గత ప్రభుత్వ విధానాల్లో పరిహారాన్ని కోల్పోయారు.
- న్యూస్‌టుడే, సీతానగరం

● గత వైకాపా ప్రభుత్వం పాడిపరిశ్రమాభివృద్ధిపై నిర్లక్ష్యం వహించడమే కాకుండా రైతులకు ఇచ్చే సంక్షేమ పథకాలను సైతం రద్దు చేసింది. పశుబీమాలో కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులు వాటాగా అందిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే 50 శాతానికి మొండిచేయి చూపించింది. పాడి పశువులతో పాటు మేకలు, గొర్రెలు, పందులకు బీమా లేకుండా గత ప్రభుత్వం మూగజీవాలపై చూపిన అలసత్వం వల్ల పాడి రైతులకు ఇబ్బందులు ఏర్పడగా.. పరిష్కారంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది.

డివిజన్ పరిధిలో...

నియోజకవర్గం	ఆవులు, గేదెలు	మేకలు, గొర్రెలు
రాజానగరం	69,473	91,851
రాజమహేంద్రవరం గ్రామీణం	45,313	9,478
అనపర్తి	38,564	20,643
గోకవరం (మండలం)	18,228	18,269

ఎలా అంటే..!

● దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు 80 శాతం ప్రీమియం రాయితీతో, ఇతరులకు 50 శాతం రాయితీతో నాటు పశువులకు రూ.15వేలు, మేలు జాతి పశువులకు రూ.30వేల వరకు బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

● పాడిరైతులు రూ.30వేల కంటే అదనంగా బీమా చేసుకోవాలని భావిస్తే అదనపు ప్రీమియం చెల్లించడానికి 50 శాతం రాయితీ అందిస్తోంది. ఒక కుటుంబం 5 గేదెల వరకు, గొర్రెలు, మేకలు, పందులైతే 50 వరకు మాత్రమే బీమా చేసుకోవచ్చు.

● పశువులు మరణించిన వెంటనే సమీపంలోని రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి సమాచారం అందించాలి. బీమా చేసిన పశువులకు చెవి పోగు (ట్యాగ్) వేస్తారు. బీమా సర్వేయరు వచ్చేవరకు చెవిపోగుకు ఉన్న ట్యాగ్ తీయకూడదు.

● బీమా చేయించిన పశువును విక్రయిస్తే 7 రోజుల్లోగా బీమా కంపెనీ వారికి సమాచారం ఇచ్చి కొనుగోలుదారుని పేరుమీద మార్చాలి. బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్ నంబరు అన్ని ధ్రువీకరణ పత్రాలు అందించాలి.

● ఇందులో ఆవులు, గేదెలకు మూడేళ్ల పాటు బీమా ప్రీమియం వర్తిస్తోంది. మేకలు, గొర్రెలు, పందులకు ఏడాది కాలం ఉంటుంది.

రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం..



పశు బీమా పథకం వర్తింపజేయడంలో అవసరమైన బడ్జెట్ కేటాయింపులు లేక బీమా నమోదు చేయలేకపోయాం. గతంలో కొంతమంది రైతులు ముందుకొచ్చి ప్రీమియం సొమ్ము కట్టినా పరిహారం రాలేదు. రైతు చెల్లించే ప్రీమియంలోనూ రాయితీ ఇస్తూ కూటమి ప్రభుత్వం అనేక మార్గదర్శకాలు జారీచేసింది. అక్టోబరులో అవసరమైన బడ్జెట్ వస్తోంది. ఆదేశాలు రాగానే పాడిపశువులకు బీమా నమోదును ప్రారంభిస్తాం.
- డాక్టర్ మక్కిన వెంకటేశ్వర్లు, పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు, రాజమహేంద్రవరం

స్వచ్ఛత అందరి బాధ్యత: కలెక్టర్

బొమ్మూరు, న్యూస్‌టుడే: దేశమంతా స్వచ్ఛతగా ఉండాలన్నదే మహాత్మాగాంధీ లక్ష్యమని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. బొమ్మూరులో చెత్త సంపద కేంద్రాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి బుధవారం ప్రారంభించారు. గాంధీజయంతి సందర్భంగా ఆయన పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవలో భాగంగా 17 రోజులు జిల్లాలో పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. స్వచ్ఛతపై ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. త్వరలో స్వచ్ఛ బొమ్మూరుగా మారాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యర్థాలు కాలువల్లో వేయడం వల్లే పారిశుద్ధ్యం దెబ్బతింటుందన్నారు. ప్రభుత్వానికి ప్రజలు చెల్లించే ప్రతీ పైసా సద్వినియోగం చేస్తామన్నారు. అనంతరం జిల్లాలో పలు విభాగాల్లో సేవలందించిన వివిధ గ్రామాల కార్యదర్శులు, శానిటరీ సిబ్బందిని సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. డీపీవో శ్రీనివాసరావు, డీఎల్‌పీవో నాగలత, మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, తెదేపా నాయకులు మత్సేటి ప్రసాద్, కామిని ప్రసాద్ పాల్గొన్నారు.


గోరంట్ల, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

పరిసరాల పరిశుభ్రత అవసరం

అనపర్తి గ్రామీణం, రంగంపేట: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ ముగింపు కార్యక్రమాన్ని బుధవారం అనపర్తిలో నిర్వహించారు. మహాత్మాగాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రిల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రధాన రహదారిలో అధికారులు, నాయకులతో కలిసి ఆయన రోడ్డు ఊడ్చి శుభ్రం చేశారు. భాజపా నేత శివరామకృష్ణంరాజు, తెదేపా నేతలు తమలంపూడి సుధాకర్‌రెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి పాల్గొన్నారు. ● రంగంపేట ప్రధాన రహదారిలో చేపట్టిన పారిశుద్ధ్య పనుల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఉద్యోగులు, కూటమి నాయకులు, జి.ఎస్.ఎల్. దంత వైద్య కళాశాల విద్యార్థులతో కలిసి ప్రధాన రహదారిని ఎమ్మెల్యే శుభ్రం చేశారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో పి.వెంకటరత్నం, ఉపసర్పంచి బలిరెడ్డి దుర్గారావు పాల్గొన్నారు.


అనపర్తిలో రోడ్డు శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన పురందేశ్వరి

బొమ్మూరు: బొమ్మూరులోని మహారోగి ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీ పురందేశ్వరి బుధవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న కార్యక్రమాలు, ఆసుపత్రిలో వైద్య సేవలను అధికారులు వివరించారు. రోగులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భాజపా జిల్లా నాయకుడు బొమ్ముల దత్తు, కన్వీనర్ యానాపు ఏసు, కె.కృష్ణ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికలు సిద్ధం చేయండి

అనపర్తి గ్రామీణం: స్వర్ణాంధ్ర-2047 భాగంగా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. అనపర్తి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్యే నల్లమిల్లి సమీక్ష సమావేశం నిర్వహించారు.

తుప్పల్లో రైతు బజారు



రైతులు పండించిన ఉత్పత్తులను గ్రామాల్లోనే తక్కువ ధరకు వినియోగదారులకు విక్రయించాలనే లక్ష్యంతో రైతు బజారు కేంద్రం ఏర్పాటు చేశారు. సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామపంచాయతీ పరిధిలో 2018లోనే తెదేపా దీన్ని పూర్తిచేసింది. అనంతరం వైకాపా అధికారంలోకి రాగానే ఆ కేంద్రాన్ని ప్రారంభించకుండా వదిలేయడంతో ప్రస్తుతం చుట్టూ తుప్పలు పెరిగి శిథిలస్థితికి చేరింది. రూ.లక్షల నిధులతో నిర్మాణం పూర్తి చేసినా వినియోగించకపోవడంతో ఇలా తయారైంది. ఇప్పటికీ రఘుదేవపురంలో రైతు బజారు లేకుండా రోడ్డు పక్కనే మాంసం, చేపలు, కూరగాయలు విక్రయాలు చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, సీతానగరం

నర్సరీల్లో దొంగల హల్‌చల్

కడియం, న్యూస్‌టుడే: కడియం మండల నర్సరీ రైతులు రాగితీగల చోరులతో బెంబేలెత్తుతున్నారు. రూ.లక్షలాది విలువ చేసే విద్యుత్తు మోటార్లకు అమర్చిన రాగితీగలను రాత్రి వేళ నర్సరీల్లో చొరబడి తీగల మధ్య ఉన్న రాగిని తస్కరిస్తూ కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాగి తీగలు తీసేసి విద్యుత్తు తీగలను అక్కడే పడేసి వెళ్లిపోతున్నారన్నారు. మొక్కలకు అవసరమైన నీళ్ల తడికి విద్యుత్తు తీగలను తిరిగి సరిచేసేందుకు రూ.5 నుంచి రూ.10వేలు చొప్పున ప్రతి రైతుకు చేతి చమురు వదులుతుందన్నారు. కాగా కడియం సీఐ వెంకటేశ్వరరావును ఈ చోరీలపై వివరణ కోరగా ఇప్పటి వరకూ ఎలాంటి ఫిర్యాదు అందలేదని, నర్సరీరైతులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే తప్పనిసరిగా నిఘా పెట్టి చోరీలకు అడ్డుకట్ట వేస్తామన్నారు.

శరన్నవరాత్రులకు సర్వం సిద్ధం

● గోకవరం దేవీచౌక్ వద్ద నేటి నుంచి ఉత్సవాలు

గోకవరం, న్యూస్‌టుడే: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా గోకవరం దేవీచౌక్ దుర్గాదేవి అమ్మవారు ప్రసిద్ధి. దసరా సమయంలో ఇక్కడ అంగరంగ వైభవంగా జరిగే ఉత్సవాలను తిలకించడంతో పాటు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివస్తుంటారు. ప్రతి ఏటా నిర్వహించినట్లే ఈ ఏడాది ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఆలయం వద్ద పెద్దఎత్తున విద్యుత్తు దీపాలంకరణలు, ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లును పూర్తి చేశారు. భక్తులు, దాతలు సహకారంతో ఈ ఏడాది 22వ శరన్నవరాత్రి ఉత్సవాలను సుమారు రూ.40 లక్షలు ఖర్చు చేసి జరపనున్నారు. ఉత్సవాల అనంతరం నిర్వహించే ఊరేగింపు ఈ ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణ.


ఆలయం వద్ద అలంకరణ, దుర్గాదేవి అమ్మవారు (అంతర చిత్రం)

పొద్దంతా కూడు..పొద్దుగూకితే గూడు!

బరువెక్కిన బతుకుబండి పొద్దంతా కూడు కోసం తిరుగుతుంది.. పొద్దు గూకితే తానే గూడవుతుంది. తూర్పు గోదావరిజిల్లా సీతానగరం మండలం వంగలపూడిలో ఇప్పటికీ పంటచేలు పక్కన ఉండే బోదెల వద్ద పూరిగుడిసెల్లో కొన్ని కుటుంబాలు 50 వరకు ఉన్నాయి. వరిచేలల్లో ఉండే ఎలుకలను పట్టుకుని రైతుకు పంట నష్టం రాకుండా చూసే వీరికి ఇటీవల కాలంలో ఆ పనులు తగ్గిపోయాయి. వీరి కుటుంబాల్లోని పిల్లలకు చదువులంటే తెలియదు. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు వెదుక్కుంటున్నారు. ఒక బళ్ల రిక్షాపై ముగ్గురు పిల్లలు భార్య మంగతో కలిసి గనిశెట్టి రాజు గాంధీ జయంతి రోజున రోడ్ల పక్కన పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుకుంటూ 'న్యూస్‌టుడే'కు కనిపించారు. వాటిని అమ్ముకుంటే వచ్చే డబ్బులనే జీవనోపాధిగా మార్చుకున్నారు. పరోక్షంగా పర్యావరణానికి హాని కలగకుండా ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్నారు. వీరికి చేతిలో పట్టా పెట్టి స్థలం చూపించకుండానే జగనన్న ఇళ్ల లబ్ధిదారులుగా రికార్డుల్లో చూపిస్తున్నారు.
- న్యూస్‌టుడే, సీతానగరం


బతుకుబండిపైనే భార్యాభర్తలు, ముగ్గురు పిల్లలు

అన్ని సొసైటీలపై విచారణ చేయిస్తాం

సీతానగరం, న్యూస్‌టుడే: అన్ని సొసైటీల్లోనూ అవకతవకలపై విచారణ నిర్వహించేలా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. సీతానగరం మండలం రఘుదేవపురంలో ఆయన మాట్లాడారు. వైకాపా హయాంలో సొసైటీల్లో త్రీమెన్ కమిటీలను ఇష్టారాజ్యంగా నియమించడమే కాకుండా ప్రతి ఆరునెలలకొకసారి పదవులు పెంచేలా వ్యక్తులను మార్చడం వల్ల పలు సొసైటీల్లో భారీగా దోపిడీ జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే పది సొసైటీల్లో నిధుల గల్లంతుపై విచారణ నిర్వహించాలని రైతులు కోరుతున్నారన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

పూర్ణచంద్రారెడ్డి విగ్రహానికి నివాళి

బొమ్మూరు: సంఘ సేవకుడు గొందేశి పూర్ణచంద్రారెడ్డి 85వ జయంతిని బాలాజీపేట కూడలిలో బుధవారం నిర్వహించారు. ఆ సందర్భంగా విగ్రహానికి ఆయన కుమారుడు శ్రీనివాసుల రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహారోగి ఆరోగ్య కేంద్రంలో పేదలకు చీరలు, దుప్పట్లు, భోజనం అందించారు.


విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న స్థానికులు

అవీ ఇవీ అన్నీ

● వరద బాధితులకు సాయం

రంగంపేట, న్యూస్‌టుడే: వరద బాధితులకు సాయం అందించేందుకు రంగంపేట వెల్డింగ్ షాపు, బైక్ వర్కర్స్ యూనియన్ ముందడుగు వేసింది. రూ.5700లను ముఖ్యమంత్రి సహాయనిధికి సమకూర్చగా ఈమొత్తంను బుధవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి సంఘం నాయకుడు బ్రహ్మాజీ అందించారు.

● ధవళేశ్వరంలో గ్రామ సభ

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: ధవళేశ్వరం పంచాయతీలో బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని గ్రామ ప్రత్యేకాధికారి గిరిధర్, తెదేపా నాయకుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ సభలో ప్రజలు పారిశుద్ధ్యం, తాగునీరు, మురుగుకాలువల పరిస్థితిని సభ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ప్రత్యేకాధికారి హామీఇచ్చారు. తెదేపా నాయకులు పండూరి అప్పారావు, ఏకబాబు జనసేన నాయకులు యడ్ల మహేష్, బీరా ప్రకాష్ ఒంటెద్దు స్వామి పాల్గొన్నారు.

● 12 నుంచి సాయిబాబా పుణ్యతిథి ఉత్సవాలు

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ ద్వారకాసాయినగర్‌లోని షిరిడిసాయిబాబా ఆలయంలో ఈ నెల 12వ తేదీ నుంచి 14 వరకు పుణ్యతిథి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు వి.రామకృష్ణ, కె.నాగేశ్వరరావు, కె.రమేష్‌కుమార్, ఎస్కే.బిజిలానీ, ఎం.రాము తెలిపారు. 12న పంచామృతాభిషేకాలు 13న సాయి సత్యవ్రతాలు, 14న సహస్ర గులాబీ అర్చన జరుగుతాయన్నారు.

● అన్నసమారాధన

బొమ్మూరు: వినాయకచవితి ముగింపు సందర్భంగా బొమ్మూరు కొత్తపేట యూత్ ఆధ్వర్యంలో బుధవారం మధ్నాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు నైవేద్యాలు సమర్పించారు. తెదేపా మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, బలగాని అంజి, పోసమ్మ పాల్గొన్నారు.

● రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

బిక్కవోలు, రాజానగరం: రంగాపురం, రాజానగరం విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

● 120 మంది రక్తదానం

రాజానగరం: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా రాజానగరంలో కాకినాడ వారి యువసేన బ్లడ్ బ్యాంక్ సహకారంతో సత్య దుర్గ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. డా. బొల్లం సతీష్ శిబిరాన్ని ప్రారంభించారు. రాజానగరం పరిసర ప్రాంతాలకు చెందిన 120 మంది యువకులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు కె.శ్రీనివాస్, సహ వ్యవస్థాపకుడు ఎ.సాయి, జి.ప్రసాద్, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

800 గ్రాముల గంజాయి స్వాధీనం

రాజానగరం: చక్రద్వారబంధంలోని రాకీ అవెన్యూస్ నందు 800 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని రాజానగరం సీఐ ఎస్.పి. వీరయ్యగౌడ్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రాకీ అవెన్యూస్‌లో గల చంద్రిక, అవంతికలో యమున బ్లాక్ నందు మూడో ఫ్లోర్‌లోని ఓ గదిలో పరిశీలించారు. అక్కడ మిట్టని సాయికుమార్, కట్టమూరి యశ్వంత్, దుర్గాడ పండు(మహేష్) కలసి గది అద్దెకు తీసుకుని గంజాయి తాగే అలవాటు ఉన్న యువకులను ఇక్కడకు పిలిచి వారికి విక్రయిస్తున్నారు. నిందితులు ముగ్గురిని కోర్టుకు తరలించామని వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు.


బొమ్మూరులో నివాళి అర్పిస్తున్న తెదేపా నాయకులు


గాంధీ అక్షరక్రమంలో కడియం జడ్పీ పాఠశాల విద్యార్థులు


సొసైటీలో మొక్కలు నాటుతున్న ఉద్యోగులు, రైతులు

మహాత్ముడి ఆశయాలను అందిపుచ్చుకోవాలి

బొమ్మూరు, కడియం, హుకుంపేట, రాజానగరం, సీతానగరం, రంగంపేట, బిక్కవోలు, న్యూస్‌టుడే: రాజానగరం, అనపర్తి, రాజమహేంద్రవరం గ్రామీణం నియోజకవర్గాల్లో గాంధీజీ, లాల్ బహుదూర్ శాస్త్రీ జయంతిని ఘనంగా నిర్వహించారు. విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జాతిపిత మహాత్మాగాంధీజీ ఆశయాలను నేటి యువత అందిపుచ్చుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కడియం జడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థినులు గాంధీ అక్షర ఆకృతిగా నిలిచి అబ్బురపరిచారు. సీతానగరం మండలంలోని పలు సొసైటీలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు. రంగంపేటలో గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిక్కవోలు మండలంలోని ఊలపల్లిలో పారిశుద్ధ్య కార్మికులకు పారిశుద్ధ్య సామగ్రిని ఎన్డీయే నాయకులు సురేష్ కుమార్‌రెడ్డి పంపిణీ చేశారు.


రాజానగరంలో..

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



గాంధీజీ విగ్రహం ఎదుట డీటీఎఫ్ సభ్యుల నిరసన

ఓపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టాలి

నల్లజర్ల, న్యూస్‌టుడే: జీవో నంబర్ 117ను రద్దు చేయాలని, ఆంగ్ల భాషా మాధ్యమంతోపాటు మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించాలని డీటీఎఫ్ సభ్యులు కోరారు. ఈ మేరకు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న గాంధీ విగ్రహం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.నరహరి, జిల్లా అధ్యక్షుడు శేషబ్రహ్మం, త్రినాథరావు, బొందల శ్రీనివాసరావు, ఉమాబాయి తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

నిడదవోలు: పోరాటాలతోనే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు పాలకులు చేపట్టారని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు అన్నారు. నిడదవోలులో కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా కేవీపీఎస్ పతాకాన్ని రాంబాబు ఆవిష్కరించారు. సురేష్, సురేష్, శేఖర్, తిరుపతిరావు, పాల్గొన్నారు.

కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధి

నల్లజర్ల: కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళుతోందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. ద్వారకాతిరుమల మండలం బుట్టాయిగూడెంకి చెందిన 30 మంది వైకాపా శ్రేణులు బుధవారం నల్లజర్లలోని తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మండల తెదేపా అధ్యక్షుడు అంకా సత్యనారాయణ, యద్దనపూడి బ్రహ్మరాజు, పసుమర్తి రతీష్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వెంకటరాజు

పల్లెల స్వచ్ఛత.. అభివృద్ధిపై స్పష్టత



ఘన వ్యర్థ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: బాపూజీ కలలుగన్న స్వచ్ఛత.. పల్లెల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ముగింపు, గాంధీ జయంతి సందర్భంగా కొవ్వూరు వాసవీ క్లబ్ అధ్యక్షుడు దేవతు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రధాన నీటి సరఫరా కేంద్రం ప్రాంగణంలో 10 వేల సీడ్ బాల్స్(విత్తనాలతో కూడిన మట్టి బంతులు)ను వదిలే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నూలు వారి సత్రంలో మొక్కలు నాటారు. సాయంత్రం కుమారదేవంలో ఘన వ్యర్థ కేంద్రాన్ని పునః ప్రారంభించి ఆవరణలో మొక్కలు నాటారు. దశల వారీగా అన్నిచోట్లా సంపద కేంద్రాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీవో కె.సుశీల, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, మద్దుల సత్యనారాయణ, మద్దిపాటి సత్యనారాయణ, మద్దిపట్ల సురేష్, తోరం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సేవలు అభినందనీయం..

తాళ్లపూడి: పల్లెల్లో చెత్తచెదరాలు లేకుండా శుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు పరశురామారావు తెలిపారు. మండల పరిధిలోని సంపద కేంద్రాల వద్ద సర్పంచుల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి, వారి సేవలను కొనియాడారు. ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ వీరన్న, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం, గజ్జరం, అన్నదేవరపేట తదితర పాఠశాలల విద్యార్థులు బుధవారం ప్రదర్శనలు నిర్వహించి, మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు.

నల్లజర్ల: ప్రకాశరావుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛత, సేవ, గాంధీజీ సేవా భావాలపై గత వారం నిర్వహించిన వక్తృత్వ, వ్యాస రచన, చిత్రలేఖన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి కృషి విజ్ఞాన కేంద్రం (వెంకట్రామన్నగూడెం) ప్రధాన శాస్త్రవేత్త డా. కరుణశ్రీ చేతుల మీదుగా బుధవారం ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ● రాష్ట్రంలో పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, ఆవపాడు సర్పంచి అచ్యుత సత్యనారాయణ పేర్కొన్నారు. ఆవపాడు గ్రామ సచివాలయం వద్ద పంచాయితీ పారిశుద్ధ్య సిబ్బందిని సత్కరించి, దుస్తులు అందజేశారు. కార్యదర్శి అనురాధ, ఉప సర్పంచి ఈర్లపాటి జయ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి కార్మికులను సత్కరించారు.



అన్నదేవరపేటలో పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



వేగేశ్వరపురంలో విద్యార్థుల ప్రదర్శన



ప్రకాశరావుపాలెంలో విద్యార్థిని షణ్ముఖి లక్ష్మి తులసికి జ్ఞాపిక అందజేత

స్థూల వేతనమైనా అందించండి



మౌనదీక్ష చేస్తున్న ఒప్పంద పారా మెడికల్ ఉద్యోగులు

నల్లజర్ల: సర్వీసు క్రమబద్ధీకరించకపోయినా గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నూరు శాతం వేతనం ఉత్తర్వులనైనా అమలు చేయాలని కోరుతూ ఒప్పంద పారా మెడికల్ ఉద్యోగులు బుధవారం నల్లజర్లలోని గాంధీజీ విగ్రహం వద్ద మౌనదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత ఐక్య కార్యచరణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ జి.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ నూరు శాతం వేతనం అందేలా జీవో ఇచ్చి ఏడాది గడుస్తున్నా నేటికి అమలుకు నోచుకోకపోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నామన్నారు. మిగిలిన ఉద్యోగుల మాదిరిగా తమకూ 62 ఏళ్లకే పదవీ విరమణ అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా నల్లజర్లకు విచ్చేసిన రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరిని కలసి విజ్ఞప్తి చేశారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చినట్లు ప్రసాద్ తెలిపారు.

క్రిమినల్ చట్టాలు, కోడ్‌లను రద్దు చేయాలి

నిడదవోలు: మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాలు, కోడ్‌లను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని శెట్టిపేటలో ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశం ఖండవల్లి వీరవెంకట్రావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. పాటంశెట్టి రాజేష్, రావి వరహాలస్వామి, ఖండవల్లి దుర్గారావు, దిడ్ల నరేష్, ఎల్లే రాజారావు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం వెళ్లి పింఛను పంపిణీ

నిడదవోలు: నిడదవోలు మండలం అట్లపాడుకు చెందిన గుర్రాల చంటి సామాజిక పింఛనుదారుడు. ఆరోగ్యం బాగోలేక పోవడంతో కొయ్యలగూడెంలో ఉంటున్నారు. విషయం తెలుసుకున్న సచివాలయ సిబ్బంది పృథ్వీరాజ్ బుధవారం అక్కడకు వెళ్లి పింఛన్ అందించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

రాజమహేంద్రవరంలో వృద్ధుడికి.. ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రుకు చెందిన సూరిశెట్టి వెంకన్న అనే వృద్ధుడు పాముకాటుకు గురికావటంతో రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సచివాలయ ఉద్యోగి కాళహస్తి గంగాధర్ బుధవారం అక్కడకు వెళ్లి ఆయనకు పింఛను అందజేశారు.

చేకూరి ఫౌండేషన్ చేయూత

ఉండ్రాజవరం: వెలగదుర్రులో ఎన్ఆర్ఐ, చేకూరి ఫౌండేషన్ ఛైర్మన్ చేకూరి సత్యనారాయణరాజు ఆర్థిక సాయంతో గ్రామంలోని దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, పేదలకు దుప్పట్లు, పండ్లు బుధవారం పంపిణీ చేశారు. సర్పంచి సాగి పద్మావతి, ఫౌండేషన్ ప్రతినిధి ఇందుకూరి కేశవరాజు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కార్యదర్శికి సత్కారం

ఉండ్రాజవరం: బదిలీపై వెళుతున్న తాడిపర్రు పంచాయతీ కార్యదర్శి పోలవరపు సత్యనారాయణకు సర్పంచి కరుటూరి నరేంద్రబాబు ఆధ్వర్యంలో బుధవారం వీడ్కోలు సభ నిర్వహించి సత్కరించారు. కూటమి నాయకులు ప్రసాదు, గోపాలకృష్ణమూర్తి, సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు..

నిడదవోలు: తాడిమళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు మానవతా మాజీ అధ్యక్షుడు కొప్పుల వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో బుధవారం కుర్చీలు అందించారు. కోరుమామిడి, తాడిమళ్ల, కాటకోటేశ్వరం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఆరుగురు ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. అధ్యక్షుడు సూర్యచంద్రరావు, వెంకటరమణ, గంగరాజు, కొండలరాయుడు, సుబ్బారావు, హైదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తాళ్లపూడి: రావూరుపాడుకు చెందిన బాశెట్టి కాంతమ్మ అనే వృద్ధురాలు ఇటీవల మృతి చెందారు. ఆమె పెద్దకార్యం నిమిత్తం రూ.12 వేలు అందించినట్లు మానవత సంస్థ అధ్యక్షుడు సురేష్, రీజనల్ ఛైర్మన్ చంద్రయ్య తెలిపారు.



క్రీడాకారులకు దిశా నిర్దేశం చేస్తున్న ఎస్ఎన్ మూర్తి

క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి

97 పాఠశాలల నుంచి 1400 మంది హాజరు

రాజానగరం, తుని, న్యూస్‌టుడే: రాజానగరం మండలం దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఈనెల మూడో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని సీబీఎస్ఈ క్లస్టర్ -7 పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని 97 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి 135 వాలీబాల్ జట్లు, సుమారు 1400 మంది క్రీడాకారులు, 150 మంది కోచ్‌లు, రిఫరీలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 30 మంది హాజరవుతున్నారు. పోటీల పర్యవేక్షకులు సీబీఎస్ఈ ఢిల్లీ నుంచి పరిశీలకులు వస్తున్నారు. ఈ మేరకు పాఠశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ సీహెచ్.విజయప్రకాష్ బుధవారం మాట్లాడుతూ అతిథులందరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్నిరకాల వసతులు కల్పించామన్నారు. ప్రిన్సిపల్ ఎస్ఎన్ మూర్తి, క్రీడల సమన్వయకర్త గంగాధర్ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు దిశ నిర్దేశం చేశారు.

భళా.. నఖ చిత్ర కళ

గోటితో చిత్రాలు రూపొందిస్తున్న చిత్రకారుడు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆయనకు చేతి గోళ్లే కుంచెలవుతాయి. వర్ణాలు లేకుండానే ఆ చిత్రాలు సజీవ రూపాలుగా గోచరిస్తాయి. వాటిని గీస్తున్న చిత్రకారుడు కొవ్వూరు మండలం చిడిపికి చెందిన పరస రవి. 16వ శతాబ్దంలో తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాల్లో బోధనాంశంగా ఉన్న నఖ చిత్ర కళకు ఆ వైభవాన్ని తేవాలన్న సంకల్పం బూనారు. ప్రస్తుతం చేతిరాత, వ్యక్తిత్వ వికాస నిపుణునిగా రాణిస్తున్నారు. సొంతూరిలో వ్యవసాయం చేస్తూ రాజమహేంద్రవరంలో ఉంటూ ఇంజినీరింగ్, మెడికల్, పీజీ కళాశాలల్లో విద్యార్థులకు చేతిరాతతోపాటు యువతను ముఖాముఖిలకు సన్నద్ధం చేస్తున్నారు.

3,910 గణపతులు..

అచ్చులు, హల్లుల్లోని ప్రతి అక్షరం స్ఫురించేలా పలు గణపతి చిత్రాలను గీశారు రవి. 13 సంవత్సరాలుగా నఖ చిత్రాలు గీస్తున్న ఆయన ఇప్పటివరకు 3,910 గణపతి చిత్రాలకు రూపమిచ్చారు. 1,200 వరకు ఓంకార, శివుడితో ఉన్నట్లుగా 800, వల్లభ, లక్ష్మీగణపతి ఇలా 32 రూపాల్లో గణపతులను అవలీలగా గీశారు. దినోత్సవాలు, ప్రముఖుల జయంతులు, పండుగల వంటి పర్వదినాల సందర్భాల్లో వాటి ప్రాధాన్యతను తెలిపే వేలాది చిత్రాలు వేశారు.

అవార్డులు, ప్రశంసలు..

ఈయన విభిన్న రూపాల్లో గణపతి చిత్రాలను గీసి తెలుగు, భారత్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం పొందారు. 2018 ఉగాది పురస్కారాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అందుకున్నారు. 2016లో కాలిఫోర్నియాలోని బర్కిలీ విశ్వవిద్యాలయం 'గౌరవ డాక్టరేట్' ప్రదానం చేసింది.



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడితో పరస రవి (పాత చిత్రం)

'గోటి చిత్రాలు- మేటి రాతలు' పేరుతో 12 రోజులపాటు ద్వాదశ జ్యోతిర్లింగాలను గీశారు. విదేశాలలో సైతం ఈ నఖ చిత్రాలు ఆదరణను చూరగొన్నాయి. నఖచిత్ర కళలో ప్రతిభ కనబర్చి ఇప్పటివరకు 17 బిరుదులు అందుకున్నారు. గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, కళాతపస్వి కె.విశ్వనాథ్, పాటల రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కంచి పీఠం స్వాములు, వివిధ హోదాల్లో ఉన్న వారి చిత్రాలను గీసి స్వయంగా వారికి అందించి మన్ననలు పొందారు. గాయకుడు బాలసుబ్రహ్మణ్యంకు చిత్రం గీసి ఇవ్వగా ఆయన ఎంతో ఆనందపడి రవిని సన్మానించారు.



రవి గోటితో గీసిన చిత్రాలు..

పూర్వవైభవం తేవాలని..

నాకంటూ ఓ ప్రత్యేకత కోసం నఖ చిత్రాలను గీయడం అలవర్చుకున్నాను. చదువొక్కటే కాకుండా విద్యార్థులకు ఇష్టమైన అంశాల్లో ప్రావీణ్యం పెంచాలి. వారిలో ఉన్న సృజనను ఆదరించాలి. విద్యార్థులకు వీటిని నేర్పిస్తూ ఈ కళకు పూర్వవైభవం తేవాలని శ్రమిస్తున్నాను.

- పరస రవి

మెట్టలో పిడుగుల వాన

ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి: మెట్ట ప్రాంతంలో బుధవారం రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. రెండు గంటలపాటు ఏకధాటిగా ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి తోడు పలుచోట్ల పిడుగులు పడి బెంబేలెత్తించాయి. ఏలేశ్వరం మండలం లింగారం కాలనీ హైస్కూల్ వెనుక వీధిలో, ప్రత్తిపాడులో ఆయా కుండలమైన పిడుగులు పడ్డాయి. విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. ప్రత్తిపాడు సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. మధ్యాహ్నం వేసవిని తలపించిన వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా మారిపోయింది. మెరుపుల వెలుతురు, వాహనాలు రెండు గంటల పాటు కొనసాగడంతో ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించింది.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ఉండ్రాజవరం: మండలంలోని మోర్తకు చెందిన పదహారేళ్ల బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం.. పదో తరగతి వరకు చదివిన ఆమె ఇంటివద్దనే ఉంటూ ఇంటి పనులు చేస్తోందన్నారు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద, పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తల్లి బుధవారం ఉదయం ఠాణాలో ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక క్షేత్రం.. అంధకారమయం

జిల్లాలో పురాణ ప్రాశస్త్యం సంతరించుకున్న వాటిలో కొవ్వూరు గోష్పాద క్షేత్రం ఒకటి. ఆధ్యాత్మిక, ఆహ్లాదకరమైన ప్రదేశం. ఇక్కడి పవిత్ర గోదావరిలో స్నానమాచరించాలని భక్తులు కోరుకుంటారు. ఇతర రాష్ట్రాల నుంచి సైతం యాత్రికులు ప్రత్యేక బస్సులు, వాహనాల్లో ఇక్కడికి వస్తుంటారు. ఇంత ప్రాముఖ్యతగల క్షేత్రాన్ని మౌలిక సదుపాయాల లేమి పట్టి పీడిస్తోంది. ప్రధానంగా క్షేత్రంలో ప్రవేశించే రెండు మార్గాల్లో విద్యుద్దీపాలు సరిగా వెలగడం లేదు. రాత్రయితే ఈ ప్రదేశం చీకటిమయంగా మారుతోంది. ఇక్కడికి వచ్చే వాహనాలకు ఉన్న వెలుగే ఆధారంగా మారుతోంది. ప్రధాన రేవు పొడవునా ఉన్న హైమాస్టు స్తంభాలకు అన్ని వైపులా ఉన్న దీపాలు వెలగడం లేదు. పిండాల రేవు సమీపంలోనూ ఇదే పరిస్థితి. దీంతో రాత్రి వేళల్లో కొందరు ఆకతాయిలు ఇక్కడికి చేరుతున్నారు. గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తున్న సమయంలో రేవు, మెట్లు ఎలా ఉన్నాయో కూడా కనిపించక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పూర్తిస్థాయిలో విద్యుద్దీపాలు వెలిగించేలా యంత్రాంగం శ్రద్ధ చూపాలని సర్వత్రా కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌ను వివరణ కోరగా విద్యుత్తు దీపాలకు అవసరమైన మరమ్మతులు చేపడతామన్నారు.

- న్యూస్‌టుడే, కొవ్వూరు టౌన్



క్షేత్ర ప్రవేశ మార్గంలో చీకటి

ఖైదీల్లో పరివర్తన రావాలి

దానవాయిపేట (రాజమహేంద్రవరం): కారాగారాల్లోని ఖైదీల్లో పరివర్తన తీసుకువచ్చే దిశగా జైలు అధికారులు కృషి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం కారాగారంలోని మహిళా జైలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా తొలుత మహాత్ముడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జైలులో మహిళా ఖైదీలకు అందిస్తోన్న వసతులపై ఆరా తీశారు. ఖైదీలకు నిర్వహించిన ఆటపాటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఖైదీల పిల్లలకు బొమ్మలు, దుస్తులు, పుస్తకాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళా జైలు ఆశ్రమ వాతావరణంలో ఉన్నట్లు ఉందన్నారు.



ఖైదీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

సత్ప్రవర్తన కలిగిన ఖైదీల రిలీజు విషయాల్లో సిఫార్సు చేస్తామని తెలిపారు. ఖైదీల సమస్యలు, వారి కేసులు వివరాలు డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకు రావాలన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు, అధికారులు విజయకుమారి, డాక్టర్ లక్ష్మి సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో జైళ్ల శాఖకు ఆదాయం

కేంద్ర కారాగారంలో వృత్తివిద్యా శిక్షణ పొందడం ఖైదీలకు ఆర్థిక భరోసాగా ఉంటుందని గంధం సునీత అన్నారు. పురుషుల జైలులో నిర్వహించిన కార్యక్రమంలోనూ ఆమె పాల్గొన్నారు. శిక్షణ పొందడం ద్వారా ఖైదీలు బయటకు వెళ్లిన తరువాత జీవనోపాధి మార్గం లభిస్తుందన్నారు. జైళ్ల శాఖలకూ ఆదాయం సమకూరుతుందన్నారు. ఇటీవల పలు కోర్టులకు సంబంధించి రూ.60 లక్షల విలువ చేసే ఫర్నిచర్‌ను జైళ్లశాఖ ద్వారా కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఆర్.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకేతం.. దసరా ఉత్సవం

● నవ అవతారాల్లో అమ్మవారికి పూజలు ● నేటి నుంచి దేవీశరన్నవరాత్రి వేడుకలు

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

దుష్టశక్తులపై జగజ్జనని సాధించిన విజయానికి ప్రతీకగా దసరా ఉత్సవం, విజయదశమి పర్వదినం జరుపుకొంటారు. రావణుడు, మహిషాసురుడు వెడుక సంకేతం. రావణుడికి ఉన్న పది తలలు మనిషిలో ఉన్న కామ, క్రోధ, లోభ, మోహ, అహంకారాలతోపాటు మదేంద్రియాలకు సంకేతంగా చెబుతారు. ఈ పది లక్షణాల (దశ వికారాలు) జీవితాంతం వెంటాడుతాయి. వీటిని జయించడమే మనిషికి నిజమైన విజయం. దుర్గాదేవి మొదటి రూపమైన శైలపుత్రి నుంచి నవ రూపమైన సిద్ధిధాత్రి వరకు శ్రద్ధగా పూజిస్తారు. బాల, గాయత్రి, లక్ష్మి, సరస్వతి, చండీ, దుర్గ, మహిషాసుర మర్దని, స్కందమాత, పార్వతి ఇలా ఇత్యాది అవతారాల్లో అమ్మవారు రాక్షస సంహారం చేశారు.



విశేషాలంకరణలో బాలాత్రిపురసుందరి

డివిజన్‌లో ఆలయాల ముస్తాబు..

కొవ్వూరు, నిడదవోలు పట్టణాలతోపాటు 9 మండలాల పరిధిలో దసరా ఉత్సవాలకు శోభాయమానంగా అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి ఆగమనం సందర్భంగా ఈ నెల 3న (గురువారం) దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. నిడదవోలు కోట సత్తెమ్మ, గోష్పాద క్షేత్రంలోని శ్రీబాలాత్రిపురసుందరి, కుమారదేవం గండి పోచమ్మ, కొవ్వూరుతో పాటు ఇతర మండలాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు చేయనున్నారు.

ప్రతి కార్యంలోనూ విజయం..

దృశ్యమాన ప్రపంచమంతా పరాశక్తి నిండి ఉంది. 'ఐం' అనే బీజాక్షరం సరస్వతీదేవి, 'హ్రీం' అనే బీజాక్షరం పార్వతీదేవి, 'క్లీం' అనే బీజాక్షరం లక్ష్మీదేవికి ప్రతిరూపాలు. ఈ మూడూ కలిపిన మంత్రాన్ని సర్వదా జపిస్తే విద్య, యశస్సు, ధన, ధాన్య, సంపదలు కలిగి ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని నమ్మకం.

- కలిగొట్ల కృష్ణారావు, గోదావరి నీరాజన సమితి అధ్యక్షులు, కొవ్వూరు



విద్యుత్తు కాంతులతో కళకళలాడుతున్న ఆలయం

కోట సత్తెమ్మ ఆలయంలో..

నిడదవోలు: చల్లని తల్లి.. భక్తుల కొంగు బంగారం నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయంలో దసరా వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 3న ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్ దంపతుల కలశస్థాపన కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. నవరాత్రుల సమయంలో అమ్మవారికి నిత్యం సహస్రనామ కుంకుమ పూజలు, చండీ పారాయణం, హోమం నిర్వహించనున్నారు. విజయదశమి రోజు 12న అమ్మవారికి నిత్యాభిషేకం, కుంకుమపూజలు, రాత్రి 8 గంటలకు శమీ పూజ నిర్వహించనున్నారు.

భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా..

భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. నిత్యాభిషేకం టికెట్ రూ.558, పంచామృతాలు ఆలయం వారే అందిస్తారు. క్షీరాభిషేకానికి అనుమతిస్తారు. నిత్యాభిషేకాన్ని ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి, దసరా, పర్వదినాల్లో ఉదయం 7 గంటల నుంచి ప్రారంభిస్తాం

- వి.హరిసూర్యప్రకాష్, సహాయ కమిషనర్

బాణసంచా తయారీలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కొవ్వూరు పట్టణం: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే బాణసంచా తయారు చేయాలని.. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ హెచ్చరించారు. డివిజన్ పరిధిలో చాగల్లు, ఉండ్రాజవరం మండలాల్లోని బాణసంచా తయారీ కేంద్రాల నిర్వాహకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. బాణసంచా కేంద్రాల లైసెన్సులు, వాటి క్రమబద్ధీకరణ, పని చేసే వారి వివరాలు, భద్రత, బీమా అంశాలను పరిశీలించామన్నారు. బాణసంచా తయారీ, నిల్వ, తరలింపు, తరలింపు విషయంలో విషయంలో అలసత్వం వహించొద్దని సూచించారు.

12న 'చలో కాకినాడ' విజయవంతానికి పిలుపు

నిడదవోలు, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 12న నిర్వహించే చలో కాకినాడ కార్యక్రమానికి మాలలంతా తరలిరావాలని మహాసేన రాజేష్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని తాడిమళ్లలో బుధవారం చలో కాకినాడ గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న మహాసేన రాజేష్, తదితరులు

చిరు వ్యాపారులకు గొడుగులు అందజేత

నిడదవోలు: నిడదవోలు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దాత రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో పట్టణంలోని చిరు వ్యాపారులకు బుధవారం గొడుగులు అందించారు. కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొఇత్తపల్లి రవికుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జేష్ట వెంకటేశ్వరరావు, కార్యదర్శి బేతన రామన్, కోశాధికారి బండి రామ్‌గోపాల్, జోనల్ ఛైర్‌పర్సన్ బండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో అర్జీల స్వీకరణ

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: వేలివెన్ను, ఉండ్రాజవరం తదితర పంచాయతీ కార్యాలయాల వద్ద బుధవారం సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

దేవరపల్లి: పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. దేవరపల్లి సచివాలయం ఆవరణలో సర్పంచి కడిమి వీరకుమారి ఆధ్వర్యంలో జరిగిన సభలో ఎస్సీ ఏరియాలోని పారిశుద్ధ్య సమస్యలపై ప్రస్తావించారు. పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు.

ఎంపీ పురందేశ్వరి పరామర్శ

నల్లజర్ల: పితృవియోగంతో బాధపడుతున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజును రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి బుధవారం పరామర్శించారు. నల్లజర్లలోని బాపిరాజు నివాసానికి వచ్చి ఆయన తండ్రి వెంకటరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



కొవ్వూరులో గాంధీజీ విగ్రహానికి ఆర్డీవో రాణి సుష్మిత, తదితరుల నివాళి



నిడదవోలు తెదేపా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శేషారావు, తదితరులు..



కానూరు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సత్కారం

గాంధీజీ సిద్ధాంతాలు ఆచరణీయం

జాతిపిత మహాత్మా గాంధీ సిద్ధాంతాలు ఆచరణీయమని వక్తలు పేర్కొన్నారు. కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ, వివిధ పార్టీల కార్యాలయాలు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం గాంధీ జయంతి నిర్వహించి, ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి: కొవ్వూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయ ప్రాంగణంలోని గాంధీజీ విగ్రహానికి ఆర్డీవో రాణి సుష్మిత, ప్రధాన రహదారి, ఆర్యవైశ్య కల్యాణ మండపంలో విగ్రహాలకు సంఘ అధ్యక్షుడు మట్టే ప్రసాద్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అరిగెల అరుణకుమారి, తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, సూరపనేని చిన్ని, వట్టికూటి వెంకటేశ్వరరావు, సూర్యదేవర రంజిత్ తదితరులు పాల్గొన్నారు. ● చాగల్లు, నెలటూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఊనగట్లలో జీడీఎం క్రిస్టియన్ అసెంబ్లీ చర్చిలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ఆర్.ప్రసాద్‌రాజు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. ● అన్నదేవరపేటలో తెదేపా యుగళం ఆధ్వర్యంలో గాంధీజీ, లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు.

నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం: పట్టణ తెదేపా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ తెదేపా అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, ప్రధానకార్యదర్శి తిరుపతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పురపాలక సంఘ కార్యాలయంలో ఛైర్మన్ భూపతి ఆదినారాయణ గాంధీ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం పట్టణంలోని ప్రధాన రహదారులను శుభ్రం చేశారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ● భాజపా నాయకుడు రంగా వెంకటేశ్వరరావు వృద్ధులు, పేదలకు పండ్లు, బిస్కెట్లు అందించారు. ● పెరవలి డంపింగ్ యార్డును సర్పంచి గంగోలు సీతమ్మ పునఃప్రారంభించారు. ● వేలివెన్ను, ఉండ్రాజవరం, తాడిపర్రు, పాలంగిలో ఆర్యవైశ్య సేవాసంఘం ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు.

దేవరపల్లి, గోపాలపురం: దేవరపల్లిలోని పొగాకు వేలం నిర్వహణ అధికారి పి. హేమస్మిత ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు జరిపారు. పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు.



దుద్దుకూరులో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన కాంగ్రెస్ నాయకులు




దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో అధికారులు, రైతుల నివాళి



నిడదవోలులో శుభ్రం చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ ఆదినారాయణ, తదితరులు

ఆకట్టుకొని.. ఆలోచింపజేసి

నిడదవోలు, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో సర్వోదయ మండలి, గాంధీ స్మారకనిధి ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో నిడదవోలుకు చెందిన కుంచాల తపస్విరెడ్డి ప్రతిభ చూపి తృతీయ స్థానంలో నిలిచాడు. గాంధీతత్వం-నేటి భారతం అనే అంశంపై ఆయన వేసిన చిత్రం ఆకట్టుకోవడంతోపాటు ఆలోచింపజేసేదిగా ఉందని పలువురు కొనియాడారు.



తపస్విరెడ్డి వేసిన చిత్రం (అంతర చిత్రం) బహుమతి అందుకుంటూ..

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)		ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):		12,000
పాతకాయ:	గండేరా	17,500
	గటగట	15,500
కొత్తకాయ:	గండేరా	16,500
	గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):		
పాత (ముక్కుడు) కాయ		15,000-15,500
కొత్త (పచ్చి) కాయ		14,000-14,500
కొబ్బరినూనె మార్కెట్:		
15 కిలోలు		3,750
కిలో		260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	116-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్డ్	200-00
స్కిన్‌లెస్	228-00

జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు మనీసా, రాహుల్

దేవరపల్లి: పల్నాడు జిల్లా పెద్దమక్కెనలో జరిగిన సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు అండర్-19 విభాగంలో చిన్నాయిగూడెం క్రీడాకారులు పి.సుశాంత్, ఎం.వివేక్, వై.రాహుల్, పి.సిద్ధార్థ, పి.సారధి, కె.మానస, కె.రమ్య, రామన్నపాలెం జడ్పీ పాఠశాల నుంచి ఎస్.కె.మనీసాబేగం, కె.లతిక సుధాశ్రీ, కె.సుభాషిని తృతీయ స్థానంలో నిలిచారు. వీరిలో మంచి ప్రతిభ కనపరిచిన రాహుల్, ఎస్.కె.మనీసా బేగం జాతీయస్థాయికి అండర్-19 విభాగంలో ఎంపికయ్యారు. వీరు త్వరలో మణిపూర్, నాగలాండ్ రాష్ట్రాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయులను ప్రధానోపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్, తోటి ఉపాధ్యాయులు, నాయకులు అభినందించారు.



పల్నాడు జిల్లాలో విజయం సాధించిన క్రీడాకారులు

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నోటీసు

మా క్లయింటున్నూ తూర్పుగోదావరి జిల్లా, దేవరపల్లి మండలం, దేవరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల మాధవరపు సత్యనారాయణ, తండ్రి వెంకన్న సంజాయిషీ ప్రకారం ఇచ్చిన నోటీసు.

మా క్లయింట్ పాశం అంకాలమ్మ, భర్త నారాయుడు అను ఆమెపై O.S.No.148/2010 నెంబరున దిగువ షెడ్యూల్ దాఖలా స్థలమునకు అగ్రిమెంట్ దావా చేసి ది.10-02-2011వ తేదీన డిక్రీ పొందడమైనది. డిక్రీ దరిమిలా దస్తావేజు రిజిస్ట్రేషన్ కొరకు E.P.No.87/2012 దాఖలు చేసియున్నారు. తదుపరి ఆమె చనిపోగా వారి వారసులను పార్టీలుగా చేర్చియున్నారు. సదరు E.P.No.87/2012 కోర్టులో పెండింగ్‌గా కలదు. సదరు E.P.No.87/2012 షెడ్యూల్ దాఖలా స్థలముపై లాలూచి దస్తావేజులు సృష్టించుచున్నట్లుగా తెలియవచ్చినది. అట్లు పొందిన దస్తావేజులు చెల్లనేరవని, ఆ స్థలములో ఏవిధమైన నిర్మాణములు చేసినా మా క్లయింట్ హక్కులకు భంగం కలుగదు అని తెలియజేయడమైనది.

స్థలముకు హద్దులు:

తూర్పుగోదావరి జిల్లా, కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ ఏరియాలోని దేవరపల్లి మండలం, దేవరపల్లి గ్రామం తాలూకు R.S.No.1323/1 లోని య.0-14 సెంట్ల స్థలములో య.0-11 సెంట్లు స్థలమునకు హద్దులు. **తూర్పు:** పంచాయతీ రోడ్; **దక్షిణం:** పుంత రోడ్; **పడమర:** ఉప్పలపాటి కృష్ణారావు గారి ఇల్లు, స్థలము, **ఉత్తరం;** పాశం మంగ గారి ఇల్లు, స్థలము.

యలమాటి B.B.V.V.ప్రసాదరావు
అడ్వకేట్, కొవ్వూరు,
కొవ్వూరు, తూ॥గో॥ జిల్లా,
Date: 30-09-2024. సెల్: 94410 19000